నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
1
బుధవారం | మే 22, 2024 | www.navatelangana.com

జూన్ మొదటి వారంలోపు ధాన్యం కొనుగోళ్లు వందశాతం పూర్తి చేయాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ పి. గోపీ



నవతెలంగాణ-పర్వతగిరి

జూన్ మొదటివారంలోగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వం దశాతం కొనుగోళ్లు పూర్తి కావాలని, ఎక్కడ రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జీ డాక్టర్ బీ.గోపి అన్నారు. మంగళవారం వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద ఏఎంసీలో ఐకెపి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోలు గురించి రైతులతో నేరుగా మాట్లాడారు. జూన్ మొదటివారంలోగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వం దశాతం కొనుగోళ్లు పూర్తి కావాలని, ఎక్కడ రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, కేంద్రాల్లో అన్నిఏర్పాట్లు చేయాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తూ ధాన్యం అమ్మిన రైతులకు సత్వరమే డబ్బులు అందేలా చూడాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే ప్రభుత్వం నిర్దేశించిన కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ తొందరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈప్రక్రియ దాదాపు వందశాతం పూర్తయ్యేలా అదనపు కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. 14158.80 క్వింటాళ్ల ధాన్యం సేకరించి రైస్‌మిల్లులకు తరలించడం జరిగిందని, అదేవిధంగా ఖరీఫ్ 2023-24లో 149 92 క్వింటాళ్ల ధాన్యం 275 మంది రైతుల నుండి సేకరించి రూ.3.28 కోట్లు చెల్లించామని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ కౌసల్య దేవి, జేడీఏ ఉషా దయల్, శివ ప్రసాద్ రెడ్డి, సంధ్యా రాణి, షాఫైసల్‌లు పాల్గొన్నారు.

విత్తన ఎంపిక, కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి డి. ఉషాదయాళ్



నవతెలంగాణ-పర్వతగిరి

వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు విత్తన ఎంపిక కొనుగోలు లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉషా దయాళ్ తెలిపారు. వర్ధన్నపేట మండలంలోని వర్ధన్నపేట, ఇల్లంద, కట్ర్యాల, ఉప్పరపల్లి, చెన్నారం, నల్లబెల్లి గ్రామాల్లో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి సందర్శించి విత్తనాల దుకాణాలను తనిఖీ చేసి రైతులకు తగు సూచనలు చేసారు. రైతులకు మన ప్రాంతానికి అనువైన నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలనీ డీలర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సురేష్, కన్సల్ టెంట్ జాతీయ ఆహార భద్రత మిషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా పి.సారంగం, వ్యవసాయఅధికారి టెక్నీకల్, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం వరంగల్ సిహెచ్.కష్టారెడ్డి, ఎస్.శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి ఎల్.సాగరిక, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర దొంగ అరెస్టు



నవతెలంగాణ-వరంగల్

ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రజలను నమ్మించి ద్విచక్ర వాహనాలు దొంగతనాలు చేస్తున్న అంతర్‌రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు మట్టెవాడ ఎస్ఐ లచ్చయ్య తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా సంగడి గుంటకు చెందిన చాగంటి పవన్ తిరుమలేష్ జల్సాలకు అలవాటు పడి ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలలో ప్రజల ను సుమారు 30 మందిని వారి కొత్త మోటారు సైకిల్ ను చూసి అలాంటి మోటార్ సైకిలే కొంటున్నారని వారిని మోసపూరితంగా నమ్మించి ఒకసారి ట్రయల్ చేసి చూస్తానని, మోటారు సైకిళ్లను దొంగిలించుకుని వెళ్లడం అలవాటుగా మార్చుకొని పలుమార్లు జైలుకు కూడా వెళ్లడం జరిగిందని తెలిపారు. ఇదే క్రమంలో 2024 మే 9న ములుగు ఇండస్ట్రియల్ ఏరియా వద్ద కామెర అరవింద్ అనే వ్యక్తిని తన ఆర్‌వన్ ఫైవ్ బైక్ సర్వీసింగ్ కొరకు రావడంతో అతడిని పరిచయం చేసుకొని నమ్మించి మాయమాటలు చెప్పి అతడి లాంటి బైకు కొంటున్నానని ట్రాయల్ చేసి చూస్తానని చెప్పి, బైకును దొంగిలించుకొని వెళ్లగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టీ.గోపి మాట్లా డుతూ మోసపూరితమైన దొంగతనాలు చాలా రకాలుగా జరు గుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిచయం లేని వ్యక్తులకు విలువైన వస్తువులు ఏవి ఇవ్వకూడదని తెలిపారు. అంతే కాకుండా దొంగలు ఎంతటి వారైనా చివరికి పట్టుబడతారని అన్నారు.

ఉపాధి హామీ పథకంపై సమీక్ష



నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిడిఓ శంకర్ అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్ లతో సమీక్ష సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ కౌసల్య దేవి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో యాక్టివ్ జాబ్ కార్డులు అందరికీ పని కల్పించాలని, ప్రతి గ్రామంలో 200 మంది కూలీలకు పనులు కల్పించాలని అలాగే మండలంలో 150 పాంపాండ్స్,10 ఫిష్ బ్రీడింగ్స్‌పాండ్స్, 150ఎకరాల్లో హార్టికల్చర్ ప్లాంటేషన్ చేయించాలి సూచించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వసంస్థల్లో వర్షపునీటిని భూమిలోఇంకేందుకు రూఫ్‌టాప్‌హార్వెస్టింగ్ స్ట్రెక్చర్స్, కమ్యూ నిటీ సోక్ పిట్స్ నిర్మించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఆర్డిఓ రేణుక, ఏపిఓ సుశీల్ కుమార్, ఈసిలు,టీఏలు, సిఓ, ఎఫ్ఏలుపాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

నవతెలంగాణ-నర్సంపేట

ప్రయివేటు విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ చట్టం తీసుకరావాలని ఏఐఎఫ్‌బీఎస్ డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ఫీజుల పేరిట దోచుకుంటున్నారన్నారు. నిబంధనలు తుంగలో తొక్కి విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అధిక ఫీజులు వసూళ్ల చేస్తూ మోసగిస్తున్నారని ఆరోపించారు. విద్యా శాఖాధికారులు తనిఖీలు చేయకుండా వొదిలేయాడం వల్ల అధిక ఫీజులు వసూళ్ల చేస్తున్నారన్నారు. జీవో నెంబర్ 49కి విరుద్ధంగా యాజమాన్యాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు.ప్రభుత్వం స్పందించి ప్రత్యేక చట్టం తీసుకొచ్చి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-గీసుగొండ

మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన పలువురికి కాంగ్రెస్ నాయకులు అల్లం మర్రెడ్డి మంగళవారం ఆర్థిక సహాయం అందించారు. మనుగొండకు చెందిన కంబాల రాంబాబు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని రూ.10 వేలు, ఇదే గ్రామానికి చెందిన గుండ రమేష్ అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి రూ.5 వేలు కాంగ్రెస్ జిల్లా నాయకులు సామాజికవేత్త అల్లం బాలకిషోర్‌రెడ్డి అల్లం మర్రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తోట కమలాకర్, మాదాసి రాంబాబు కొమ్ము మల్లస్వామి, కొ మ్ము సదానందం, గాడుదుల బొందాలు, ఉ దయ్, పున్నం, నరసింహ రాములు, అశోకు, కొమ్మాలు పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్శిటీ ఇంచార్జీ వీసీగా వాకాటి కరుణ

- వైస్ ఛాన్సలర్ పదవి కోసం ముమ్మర యత్నాలు





నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కాకతీయ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్స్‌లర్‌గా సీనియర్ ఐఎఎస్ అధికారి వాకాటి కరుణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొత్త వైస్‌ఛాన్స్‌లర్ల నియామకంలో ప్రతిష్ఠంభన నెలకొంది. పలువురు వైస్‌ఛాన్స్‌లర్‌లపై తీవ్ర ఆరోపణలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీనియర్ ఐఎఎస్ అధికారులను అన్ని యూనివర్సిటీలకు ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్లుగా నియమిస్తూ ఆదేశాలు జారీచేసింది. ఒకట్రెండు రోజుల్లో వీరంతా బాధ్యతలు స్వీకరించే అవకాశముంది. ఇదిలావుంటే కేయూ వీసీ పదవికోసం పలువురు మాజీ వైస్ ఛాన్స్‌లర్లు, ప్రొఫెసర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే యూనివర్సిటీల వైస్‌ఛాన్స్‌లర్‌ల నియామకం పూర్తి చేసే అవకాశముందని ప్రచారం జరుగుతుంది.

కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ రమేష్ తీసుకున్న పలు నిర్ణయాలపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగామారింది. కాకతీయ విశ్వవిద్యాలయంలోని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్)కు మధ్య తీవ్రవిభేధాలు నెలకొన్నాయి. పదోన్నతులు, పలు పాలనాపరమైన వ్యవహారాలపై 'అకుట్' ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీకి ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఈ విచారణను విసి ప్రొఫెసర్ రమేష్ ఆహ్వానించడం గమనార్హం. ఇదిలావుంటే తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విశ్వవిద్యాలయాలకు ఇన్‌ఛార్జి వైస్ ఛా న్స్‌లర్లుగా సీనియర్ ఐఎఎస్‌లను నియమించడం విశేషం.

ఇన్‌ఛార్జి విసిగా వాకాటి కరుణ

కాకతీయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్‌గా సీనియర్ ఎఐఎస్ అధికారి వాకాటి కరుణను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వాకాటి కరుణ ఉమ్మడి వరంగల్ జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా పనిచేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాపై పట్టున్న సీనియర్ ఐఎఎస్ అధికారి కావడంతో వాకాటి కరుణను రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌ఛార్జి విసిగా నియమించినట్లు కెయు వర్గాలు చెబుతున్నాయి.

వైస్‌ఛాన్స్‌లర్ పదవికి 'క్యూ'

కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ పదవి కోసం పలువురు మాజీ వైస్‌ఛాన్స్‌లర్లు, ప్రొఫెసర్లు తీవ్రంగా ప్రయత్నాలు ప్రారంభించినట్లు ప్రచారం జరుగుతుంది. కెయులో గతంలో విసిగా పనిచేసిన బి.వెంకటరత్నం, కరీంగనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ మాజీ విసి ఇక్బాల్ అలీ, నల్గొండలోని మహాత్మగాంధీ యూనివర్సిటీ విసిగా పనిచేసిన అల్తాఫ్ హుస్సేన్ కెయు విసి పదవి రేసులో వున్నారు. ఇదిలావుంటే కెయు తాజా మాజీ విసి డాక్టర్ తాటికొండ రమేష్ సైతం మరోసారి ఈ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

రిటైర్డ్ ప్రొఫెసర్లు గాదెదయాకర్, ప్రస్తుత కెయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ యాదగిరిరావు, ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, వైస్‌ఛాన్స్‌లర్ పదవి రేసులో వున్నారు.

ఎన్నికల కోడ్ తరువాతే..

పార్లమెంటు ఎన్నికలు, పట్టభద్రుల నియోజకవర్గం ఉపఎన్నికల నేపథ్యంలో జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో వుండనుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విశ్వ విద్యాలయాలకు ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్లుగా సీనియర్ ఐఎఎస్‌లను నియమించింది. ఎన్నికల కోడ్ ముగియగానే వారం రోజుల్లోపే కొత్త వైస్ ఛాన్స్‌లర్ల నియామకం పూర్తవుతుందని ప్రచారం జరుగుతుంది. దీంతో వైస్‌ఛాన్స్‌లర్ పదవిని ఆశిస్తున్న ప్రొఫెసర్లు, రిటైర్డ్ ప్రొఫెసర్లు ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. కొత్త వైస్‌ఛాన్స్‌లర్‌గా ఎవరొస్తారోనన్న ఆసక్తి యూనివర్సిటీలో నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై యూనివర్సిటీ వర్గాలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య



నవతెలంగాణ-వరంగల్

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు జూన్ 10 నాటికి వంద శాతం పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదే శించారు. మంగళవారం జిల్లా కాలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మా ఆదర్శ పాఠశాల అభివద్ధి పనుల ప్రగతి, మంచినీటి సరఫరా, విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో మండలాలవారిగా సమగ్రంగా సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించు టకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపి కైన 464 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఇప్పటి వరకు 345 అభివృద్ధి పనులు ప్రారంభమై పూ ర్తయ్యాయని మిగిలిన 112 తక్షణమే మొదలుపెట్టి వచ్చే జూన్10 కల్లా పూర్తయ్యేలా మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో పనుల పురోగతిపై సమీక్షించి త్వరితంగా పూర్తయ్యేలా నిత్యం పర్యవేక్షించాలన్నారు.

ఆయా అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. మిగిలి ఉన్న రూ.25వేలలోపు చిన్నచిన్న పనులైన మరమ్మతులు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరాల, బ్లాక్ బోర్డు, వెంటనే పూర్తి చేయాలన్నారు. మండల సమాఖ్యల చే ఏకరూప దుస్తు ల తయారీలో వేగం పెంచి జూన్ 10లోగా విద్యా ర్థులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని అన్ని మండలాల వారీగాతాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్షిస్తూ వేసవిలో తగినంత మంచినీరు అందుబాటులో ఉందని అన్నారు. మిషన్ భగీరథ నీటితోపాటు స్థానికి నీరు సమృద్ధిగా జీపీలో సరఫరా చేయడం జరుగుతుం దని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

లికేజీలను అరికట్టడం, ఎప్పటికప్పుడు పంపుసెట్ల మరమ్మతులు చేయాలని ఆదేశించారు. బోరు బావిలు హ్యాండ్‌పంపులు, మోటర్లు సక్రమంగా పనిచేసేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. వచ్చేవర్షాకాలానికి లీకేజీ లేకుండా క్రమం తప్పకుండా క్లో రినేషన్ చేయాలని, ఆరోగ్యసమస్యలు రాకుండావర్షాకాలంలో స్వచ్ఛమైన తాగునీటిని అందించి వైద్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకో వాల న్నారు. ఈ సమీక్షలో డిఈఓ వాసంతి, డిఆర్డిఓ కౌసల్యా దేవి, డిపిఓ కల్పన, నీటిపారుదల ఈఈ వెంకట రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలి



నవతెలంగాణ-వరంగల్

సమర్ధవంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల ఏఆర్ఓ, జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్ అన్నారు. ఈనెల 27న జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ నేపథ్యంలో ఎల్‌బి కళాశాలలో పీఓలు, ఏపీఓ లకు, ఓపిఓలకు నిర్వహిస్తున్న శిక్షణను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంతోపాటు ఎన్ని కల ప్రక్రియలు పివోలు, ఏపీవోలు, ఓపిఓ ల పాత్ర కీలకంగా ఉంటుందని, ఎన్నికల సంఘం విధి విధా నాలపై అందరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ ప్రక్రియను పక డ్బందీగా చేపట్టాలని, ఓటర్లు బ్యాలెట్ బాక్స్‌ల్లో బ్యాలెట్ పేపర్‌తో ఓటు వేస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నియమనిబంధనలను పాటించాలని అధికారులకు సూచించారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

వరంగల్-ఖమ్మం-నల్గొండఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యం లోఎన్నికల్లో విధులు నిర్వహించబోయే అధికారులు సిబ్బంది ఓటు వినియోగం కోసం ఎల్‌బి కళాశాలలో ఫెసిలిటేటిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ నెల 21 నుండి 24 వరకు ఉంటుందని పోస్టల్ ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఓటు హక్కు వినియోగించు కోనున్నారని శిక్షణ నోడల్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలోజిల్లా పశువైద్యాధికారి, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గన్నీ సంచుల ధరలను సమీక్షించాలి : రైతు సంఘం



నవతెలంగాణ-కాశిబుగ్గ

పెనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో రైతుల గన్ని సంచులకు వ్యాపా రులు చెల్లిస్తున్న ధరలను సమీక్షించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్ రావు కోరారు. ఈమేరకు మంగళవారం తెలంగాణ రైతు సంఘం నాయకులు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి జి.రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా చందర్ రావు మాట్లాడుతూ ఏనుమాముల మార్కెట్‌లో రైతుల గన్నిసంచులకు చెల్లిస్తున్న రూ.30 నుండి రూ.60లకు పెంచాలన్నారు. కొనుగోలుదారులు రైతులకు ప్రతి బస్తాకు చెల్లింపులు చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు తమ మిర్చి, పత్తి పంటలను గన్ని బ్యాగులలో తెచ్చుకొని అమ్ముకునే సమయంలో కొనుగోలు చేసిన వ్యాపారులు మార్కెట్ చార్జీల కింద డబ్బులు చెల్లిస్తారని, సదరు చెల్లింపులు రెండు సంవత్సరాలకు ఒకసారి జిల్లా మార్కెట్ చైర్మన్/ జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో చెల్లింపులపై సమీక్షించి పెరిగిన ధరలకు అనుగుణంగా కొత్త ధరలు నిర్ణయించి అమలు జరుపుతారని అన్నారు. కానీ ప్రస్తుతం చెల్లిస్తున్న చార్జీలు 2017లో అప్పటి జిల్లా జయింట్ కలెక్టర్ దయానంద్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారమే చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల నెం.396 చార్జీలను సమీక్షించి నిర్ణయించినటయితే రైతులకు ఇప్పుడు గన్ని బ్యాగుకు రూ.60లు వచ్చి ఉండేవన్నారు. మరోపక్క రైతులు చెల్లిస్తున్న దాడువాయి, హమాలీ, గుల్ల, చాటవాలా లాంటి చార్జీలను మాత్రం క్రమం తప్పకుండా రెండు సంవత్సరాలకు ఒకసారి పెంచడం వల్ల రైతులపై అదనపు భారం పడిందన్నారు. ఇప్పటికైనా మార్కెట్ అధికారులు తగిన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాషిపాక రమేష్, కార్యదర్శి గోనే కుమారస్వామి, కోశాధికారి కుసం సంపత్, జిల్లా కమిటీ సభ్యుడు బల్బకూరి నర్సయ్య పాల్గొన్నారు.

ఈసెట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-వరంగల్

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ యూనివర్సిటీ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో నేరుగా రెండవ సంవత్సరంలో ప్రవేశం కోసం జరిగిన ఈసెట్ - 2024 పరీక్షలో ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాలలో రాష్ట్ర స్థాయిలో మొదటి 10 ర్యాంకు లలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం లో 3, 4, 9 ర్యాంకులు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూ నికేషన్స్ ఇంజనీరింగ్ విభాగంలో 1,2,5,6,7 ర్యాం కులు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో 2, 4 ర్యాంకులు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 2,6,10 ర్యాంకులు కైవసం చేసుకొని ప్రభంజనం సృష్టించారు. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఎస్. దీక్షిత్ 3 వ ర్యాంక్, పి.వివేక్ 4 వ ర్యాంక్, బి. హేమాశ్రీ 9 వ ర్యాంక్, పి. నాగ సాయి యశ్వంత్ 19 వ ర్యాంక్ సాధించగ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ లో రాష్ట్ర స్థాయిలో ఎం. నవ్య శ్రీ 1 వ ర్యాంక్, వి. వైష్ణవ్ 2 వ ర్యాంక్, వి.అర్షిత 5 వ ర్యాంక్, కె. హర్షిత 6 వ ర్యాంక్, పి. హారిక 7 వ ర్యాంక్, ఎండీ. సోహైల్ 11 వ ర్యాంక్ సాధించగా, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో టి. శ్రీవాత్సవ్ 2 వ ర్యాంక్, ఎం. కౌశిక్ కుమా ర్ 4 వ ర్యాంక్ సాధించగ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో కె. చందు 2 వ ర్యాంక్, కె. అఖిల్ 6 వ ర్యాంక్, బి. నిఖిల్ 10 వ ర్యాంక్, ఓ. గౌతమ్ 12 వ ర్యాంక్ సాధించారని ప్రభుత్వ పాలిటెక్నిక్, వరం గల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ గారు తెలిపారు.

ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా అద్భుత మైన ఫలితాలు సాధించిన విద్యా ర్థులను, విద్యా ర్థులకు ప్రోత్సాహం అందించిన కళాశాల విభాగ అధిపతులను, అధ్యాపకులను ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్ ప్రిన్సిపాల్ పత్యేకంగా అభినందించారు.

ముసలమ్మకుంటలో ఈతకు వెళ్లి ఇద్దరు వ్యక్తుల మృతి



నవతెలంగాణ-కాశిబుగ్గ

సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు చెరువులోని గుంతలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ముసలమ్మ కుంట చెరువులో చోటుచేసుకుంది. ఏనుమాముల ఎస్సై శ్రీకాంత్, స్థానికుల కథనం ప్రకారం దేశాయిపేట ప్రాంతానికి చెందిన జన్ను యేసు అలియాస్ విజయ్ (38), జన్ను ఆదాం (36) అనే వ్యక్తులు పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. జన్ను యేసుకు భార్య రమా, ఇద్దరు కుమారులు విశాల్, వివేక్ ఉండగా జన్ను ఆదాంకు భార్య రాధిక ఇద్దరు కుమారులు ఆదిత్య, గౌతమ్ లు ఉన్నారు. మంగళవారం తమ కుమారులకు ఈత నేర్పిస్తామని ఏసు, ఆదాంలు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ము సలమ్మ కుంట చెరువుకు చేరుకున్నారు.

ఈక్రమంలో మొదటిగా తమ కుమారులకు చెరువు లోపలికి వెళ్లకుండా ఈత నేర్పించారు. అనంతరం పిల్లలను చెరువు కట్టపై ఉంచి యేసు, ఆదాంలు ఈత కొట్టుకుంటూ చెరువు మధ్యలోకి వెళ్లారు. ఈక్రమంలో ప్రమాదవశత్తు చెరువులో ఉన్న గుంతలో పడి ఇద్దరు మతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం హాస్పిటల్ కి తరలించారు.

మొక్కల పెంపకంలో క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం

- నర్సరీల్లో ఖాళీగా కనిపిస్తున్న మట్టిసంచులు

నవతెలంగాణ-శాయంపేట



రోజురోజుకు పట్టణాలు, గ్రామాల్లో పెరుగుతున్న కాలుష్యంతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ తరుణంలో మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాయి. ప్రతీ సంవత్సరం లక్షలు వెచ్చించి నర్సరీల్లో మొక్కలు పెంచి వాటిని వర్షాకాలంలో పల్లెల్లో నాటించి పచ్చదనం పెంపొందించడానికి చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో కొందరి నిరక్ష్యంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. నర్సరీల్లో మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పచ్చదనం కనిపించడం లేదు.

మొక్కల పెంపకంపై వీడని నిర్లక్ష్యం..

శాయంపేట మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద నర్సరీల పెంపకం చేపడుతున్నారు. పంచాయతీకి ఒక నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఒక్కో నర్సరీలో సుమారు 10 వేల మొక్కలు పెంచే దిశగా ముందుకు సాగుతున్నారు. ఇందుకు ప్రతీ నర్సరీకి సుమారు రూ.1.40 లక్షల వరకు ఖర్చు చేయడం జరుగుతుంది. ఈనర్సరీల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీలకే అప్పగించగా కొందరు పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నర్సరీల్లో మొక్కలు కనిపించడం లేదు. ఆశించినస్థాయిలో మొక్కల ఎదుగుదల లేదు. న ర్సరీల నిర్వహణను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపో వడంతో నర్సరీల్లో మొక్కలు కనిపించడం లేదు. ఖాళీ మట్టి సంచులు, గడ్డి, పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. నర్సరీల్లోని మొక్కల పెంపకం సంబంధిత అధికారులు, సిబ్బంది పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

పెంచుతున్న మొక్కలివే..

మండలవ్యాప్తంగా గ్రామపంచాయతీ నర్సరీల్లో పండ్లు, పూలతో పాటు వివిధ రకాల మొక్కలైన కానుగ, గోల్మోర్, దానిమ్మ, జామ, వేప, గులాబీ, మందార, మల్లె, రావి, తులసి, బొప్పాయి, సీతాఫలం, మారేడు, దువ్వి, తదితర మొక్కలను పెంచుతున్నారు. కానుగ, గోల్మోర్, వేప, తదితర మొక్కలను రహదారుల వెంట, పూల మొక్కలను ఇంటింటా పంపిణీ చేస్తారు.

రైతాంగాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

నవతెలంగాణ-శాయంపేట

కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని చెప్పి, అధికారం లోకి వచ్చి 5నెలలుగడుస్తున్నా ఇచ్చిన హామీలను మాటతప్పి, రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని పిఎసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని మైలారం గ్రామంలో మంగళవారం అయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల రైతులకు సాగునీరందక పంటలు ఎండిపోయి నష్టపోయారని, ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులకు వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయాలని, ఈ ఖరీఫ్ పంటలకు రైతుబారోస నిధులు తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, కౌలు రైతులకు హామీ ఇచ్చిన విధంగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సన్న వడ్లకే రూ.500లు బోనస్ ఇస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో చల్లా శ్రీనివాస్‌రెడ్డి, మసీకే సదయ్య, మోతె సమ్మయ్య పాల్గొన్నారు.

డీబీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-కమలాపూర్



ఈనెల 30న జరిగే 4వ డిబిఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్, అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఈ నెల 30న జరిగే డిబిఎఫ్ రాష్ట్ర నాలుగవ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వివక్షతకు గురవుతున్న దళిత, పీడిత, అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ వారి తరఫున ప్రశ్నించే ప్రజా గొంతుకగా దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) నిలుస్తుందని అన్నారు. 1985లో కారంచేడు,1991లో చుండూరులో దళితుల మీద జరిగిన అమానవీయమైన ఊచకోతల అనంతరం 1995వ సంవత్సరంలో దళిత బహుజనల పక్షాన పోరాడడానికి సమాజంలో ఒక బలమైన సంఘంగా డిబిఎఫ్ కొరివి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో పురుడు పోసుకుందన్నారు. నాటినుండి తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ, మహిళ వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల మీద డిబిఎఫ్ అలుపెరుగని పోరాటం చేస్తుందని గుర్తు చేశారు.

ఈ క్రమంలో ఈ నెల 30న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిబీఎఫ్ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు జరుపుకుంటున్నదని, ఈ మహాసభలకు మండలం నుండి అధిక సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిబీఫ్ మండల అధ్యక్షుడు మోరే ఐలయ్య, జిల్లా నాయకులు మాట్ల మురళి, పోలేపాక మల్లేశం, జన్ను ఆనందం తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యకు పూర్వ వైభవానికి కృషి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

దూర విద్యకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని దూరవిద్య కేంద్ర పరిరక్షణ ఐక్య ఉద్యోగుల సంఘం చైర్మన్ డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో డైరెక్టర్‌గా పనిచేసిన ఆచార్య శ్రీనివాస్‌రావు తీరుతో దూరవిద్య కేంద్రంలో ప్రవేశాలు తగ్గాయన్నారు. అనంతరం ఉద్యోగులకు ఇబ్బంది కలగకుండా ఉదయం, సాయంత్రం గేట్లు తీసిపెట్టాలని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వల్లూరి రామచంద్రం కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగుల అందరు కల్సి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నల్లాని శ్రీనివాస్, డాక్టర్ కొట్టే భాస్కర్, పోలెపాక ప్రతాప్, బండి వెంకటేశ్వర్లు, బాల్నే నాగేశ్వరరావు, డాక్టర్ ఆకునూరి సుదయ్య, గౌస్ పాషా, దూర విద్యా కేంద్రం, డాక్టర్ నల్ల వేమన, డాక్టర్ తాటికాయల కుమారస్వామి, మహిళా సంఘం నాయకులు టి విజయశ్రీ, డాక్టర్ దేవకుమారి, పి.పద్మావతి, సల్మా, అల్లి రామకృష్ణ , నీలం ప్రసూప్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్



నవతెలంగాణ-సుబేదారి

ఈనెల 27న జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఉపఎన్నికల నిర్వహణలో విధులు నిర్వర్తించనున్న పీవో, ఏపీవో, ఇతర ఎన్నికల సిబ్బందికి ఎన్నికల రోజున నిర్వర్తించే విధి నిర్వహణ, బాధ్యతలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఉంటుందన్నారు. విధుల్లో పాల్గొనే ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటువేసే అవకాశం కల్పిస్తునట్లు తెలిపారు. హనుమకొండ ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 26న హనుమకొండ కేడీసీలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సిబ్బంది ఉదయం 7గంటలకు పంపిణీ కేంద్రానికి రావాలన్నారు. 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బ్యాలెట్ పేపర్ వినియోగం కనుక పోలింగ్ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

ఈ సందర్భంగా ఎన్నికల రోజున పోలింగ్ సిబ్బంది విధి నిర్వహణ గురించి మాస్టర్ ట్రైనర్లు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంబాబు, మహేందర్, శ్రీనివాసస్వామి, తదితరులు అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్స్ వినియోగాన్ని పిఓ,ఏపీఓలకు ప్రత్యక్షంగా మాస్టర్ ట్రైనర్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, వెంకట్ రెడ్డి, ఆర్డీవోలు డాక్టర్ కె.నారాయణ, వెంకటేష్, వివిధ మండలాల తహశీల్దార్లు, పీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

కేయూలో కీలకమైన ఫైళ్లు మాయంపై అకూట్ సీరియస్

- సీసీ టీవీ ఫుటేజీ బయట పెట్టాలని డిమాండ్
- రిజిస్ట్రార్‌కు అకుట్ కార్యదర్శి ఫిర్యాదు
- త్వరలోనే కేయూ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తామని వెల్లడి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ వీసీ లాడ్జి నుండి పలు కీలకమైన ఫైళ్లు మాయం చేశారని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేఖరుల సమావేశంలో వీసీపై మండిపడ్డారు. ఈనెల 17న రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శి కేయూ వీసీ ప్రొఫెసర్ టీ.రమేష్‌పై విజిలెన్స్ విచారణ కొరకు ఆదేశించిన సంగతి తెలిసిందేనని అదేరోజు విద్యా శాఖ కార్యదర్శి కేయూ రిజిస్టర్ మల్లారెడ్డికి ఎటువంటి ఫైళ్లు ముట్టకూడదని మౌఖిక ఆదేశాలిచ్చినట్టు వార్తా పత్రికల్లో వచ్చాయని తెలిపారు. ఆ రోజు నుండి వీసీ కేయూకు రావట్లేదన్నారు. ఇదిలా వుండగా ఈనెల 20న ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వీసీ లాడ్జి నుండి పలు ఫైళ్ల సంచులు యూనివర్సిటీ నుండి మాయమై బయటకు వెళ్ళాయని సమాచారం అందిందన్నారు. ఆ సమయంలో అకుట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ బ్రహ్మేశ్వరి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ రమేష్ కుమార్‌తో కలిసి మేము కేయూ పరిపాలన భవనానికి చేరుకొని రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగినట్లు తెలిపారు. వీసీ ప్రొఫెసర్ రమేష్ గత నాలుగు రోజుల నుండి కేయూకు రావడం లేదని, విజిలెన్స్ విచారణలో అవసరమైన ఫైళ్లను ఫాబ్రికేషన్ చేయడానికి వీసీ లాడ్జి నుండి వాటిని ఇంటికి తరలించారన్నారు.

ఉన్నత విద్యాశాఖ నుండి స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ ఫైళ్ళను కార్లో బయటకు తీసుకు వెళ్ళడంపై మాకు అనుమానాలున్నాయన్నారు. గత మూడేళ్లలో వీసీ తన పాలనను లాడ్జి నుండే కొనసాగించారని అనేక సార్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. వీసీ లాడ్జి నుండి తరలించిన ఫైళ్లపై దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. వీసీ లాడ్జి నుండి తరలించిన ఫైళ్లలో పలు మార్పులు చేసే అవకాశం ఉందని ఆరోపించారు. వివిధ డీన్ల వద్దనున్న పీహెచ్‌డీలలో పార్ట్ టైం ఫుల్ టైమ్ అడ్మిషన్లకు సంబంధించిన ఫైళ్లు, విద్యార్థులకు వచ్చిన మార్కుల లిస్ట్, కంప్యూటర్ కొనుగోలుకు సంబంధించిన అప్రూవల్ ఆర్డర్లను మార్చే అవకాశం వుందన్నారు. కొత్త ఫైళ్ల పైన పాత తేదీతో సంతకాలు పెట్టే అవకాశం వుందని, న్యాక్ కు సంబంధించిన తప్పుడు బిల్లులను సరి చేయడానికి, న్యాక్ బడ్జెట్ నుండి కాక న్యాక్‌కు సంబంధించిన పనులను ఇతర రెగ్యులర్ బడ్జెట్ నుండి తీసుకున్న అప్రూవల్ ఆర్డర్లను ఫాబ్రికేషన్ చేయడానికి అవకాశం వుందని తెలిపారు. స్వంత పుస్తకాలు, మెమెంటోలు, తన వ్యక్తిగత సామానులు తీసుకెళ్లి ఉండవచ్చని అంటున్న రిజిస్ట్రార్ మాటలను ఖండిస్తున్నామని తెలిపారు. ఒకవేళ అవే తీసుకువెల్లాల్సిన అవసరం ఉంంటే వేరే వాళ్ళను పంపించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. వేరే వారికి వీసీ వ్యక్తిగత ఫైళ్లు, సామాన్లు ఎలా తెలుస్తాయని, కొత్త వీసీకి ఛార్జ్ అప్పచెప్పాక తన వ్యక్తిగత సామాన్లు తీసుకువెళ్లాలన్నారు. వీసీ లాడ్జి సీసీ ఫుటేజీని పరిశీలించి దర్యాప్తు చేసి ఫైళ్లు మాయం చేసిన వారిని శిక్షించాలని ఆయన రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ విషయంపై కేయూ పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయనున్నట్లు డాక్టర్ ఇస్తారి వెల్లడించారు.

బ్లాక్‌మేయిలర్లు, మతతత్వవాదులకు తగిన బుద్ధి చెప్పండి

- మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



నవతెలంగాణ-హసన్‌పర్తి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్లాక్ మేయిలర్లు, మతతత్వ వాదులకు తగిన బుద్ధి చెప్పాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పట్టభద్రులను కోరారు. గ్రేటర్ 1వ డివిజన్ పరిధి బాలాజీ గార్డెన్స్‌లో రసమయి బాలకిషన్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులు తమ ఓటును దేశ భద్రత కోసం, ప్రశ్నించే యువగళం కోసం వినియోగించాలన్నారు.

రోజుకో వేషం వేస్తూ యూట్యూబ్ ఛానెల్స్ పెట్టి బ్లాక్ మేయిల్ రాజకీయాలు చేసి ఎదిగిన తీన్మార్ మల్లన్న ఓ వైపు, మతతత్వ పార్టీకి చెందిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మరోవైపు పట్టభద్రులను మరోసారి మోసం చేసి స్వప్రయోజనాలు పొందేందుకు వస్తున్నారని ఆరోపించారు. స్థానికుడు, యువకుడు, బిట్స్‌పిలానీలో గొప్ప చదువు చదువుకొని లక్షల వేతనం ఇచ్చే ఉద్యోగాన్ని వదలుకొని ప్రజల సేవకోసం పరితపించే బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. సమర్థుడు ప్రతిపక్షంలో దీటైన ప్రశ్నించే సత్తా కలిగి ప్రజలకు అందుబాటులో ఉండే రాకేష రెడ్డి గెలిస్తే నిరుద్యోగులకు, నిరుపేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ నాయకుడు మాజీ సీఎం కేసీఆర్ బలపర్చిన అభ్యర్థికి ఓటువేసి మరో ఉద్య మానికి తెరలేపాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, బీఆర్ఎస్ నాయకులు పావుశెట్టి శ్రీధర్, బండి రజనీకుమార్, సంగాల విక్టర్‌బాబు, నరేడ్ల శ్రీధర్, ఇమ్మడి రాజేందర్, కేదాసి రాకేష్, వెంకటేశ్వర్లు, తోట నాగరాజు, రఘు, వేల్పుల సాయికుమార్, యువకులు, విద్యార్థులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను గెలిపించండి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి యువజ న సంఘాలు సంపూర్ణ మద్దతు తెలి యజేశాయి. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా క్టర్ ఉల్లాఖాద్రీ, యూనివర్సిటీ సీనియర్ విద్యార్థి నాయకులు ప్రేమ్, కేయూ జా క్ నాయకులు దుర్గం సారయ్య, కన్నం సునిల్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులుకార్తీక్, ఎస్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు పల్లకొండ సతీష్ కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద కరపత్రాలను విడుదల చేసి తీన్మార్ మల్లన్న కి సంపూర్ణ మద్దతుని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలిపించడం వల్ల విద్యావంతులు,నిరుద్యోగులు, ప్రజల పక్షానేకాక తెలంగాణలో సబ్బండవర్గాల ప్రక్షాన ప్రశ్నించడాన్ని పోరాడటానికి మండలికి పంపించినట్లు అవుతుందన్నారు.

ప్రశ్నించే గొంతుక, నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి, గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను, అరాచకాలును ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచి నిఖార్సైన జర్నలిస్టుగా పేరుందిన తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామంచ శ్రీను, టిఎస్ఎఫ్ ప్రెసిడెంట్ నాగారం మణితేజ, సునీత, రాజేశ్వరి, మనిలా, గని తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్, 14వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ లు కోరారు. తీన్మార్ మల్లన్న గెలుపు కోరుతూ మంగళవారం 14వ డివిజన్ పరిధిలోని ఏనుమాముల బాలాజీ నగర్, తదితర ప్రాంతాలలో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడుప మహేష్, సయ్యద్ ఇంతియాజ్ మాట్లాడుతూ మల్లన్నపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని రానున్న రోజుల్లో మిగతా ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏనుమాముల అధ్యక్షుడు సౌరం అభిలాష్ నాయకులు పురాణం రవి, సారంగం, టోని, మచ్చర్ల స్టాలిన్, కోగిల సుధాకర్, గాదె అనిల్, వినయ్ పాల్గొన్నారు.

పెంపకందారులను ఆదుకోవాలి : జీఎంపీఎస్

నవతెలంగాణ-ఐనవోలు



అకాల వర్షాలవల్ల గొర్రెలు, మేకల మృత్యువాతతో పెంపకందారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత యాదవ సంఘం ఐనవోలు మండలం అధ్యక్షుడు రాజారపు రాజుయాదవ్, జీఎంపీస్ మండల కార్యదర్శి నల్లబెట్ట చిన్న రాజు యాదవ్, అధ్యక్షులు జక్కుల రవి, బోయిని వెంకన్న, దాసరి చేరాలు, అర్కాల కుమారస్వామియాదవ్,బండి వెంకటస్వామి యాదవ్‌లు కోరారు. మంగళవారం జిఎంపిఎస్ ఆధ్వర్యంలో పెంపకందారులను కలిశారు. రూ.5 లక్షల విలువైన జీవాల మృతితో గొర్రె జీవాలను జీవనాధారంగా పెంచుకొని కుటుంబాలను పోషించుకుంటున్న పెంపకందారుల పరిస్థితి తలకిందులైందన్నారు. ప్రభుత్వం వీరికి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆర్థికంగా సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. పశుసంవర్థక శాఖ వెంటనే స్పందించి ఆర్థిక సాయం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో దద్దు బాల కొమురయ్య, జక్కుల ఉప్పలయ్య, చల్ల చంద్రయ్య, పెద్ద కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి బోనాలు

నవతెలంగాణ-నయీంనగర్

గోపాల్ పూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఇట్టి బోనాల పండుగకు హాజరై అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న వారిలో తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షులు బొనగాని యాదగిరిగౌడ్, 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కొంక హరిబాబు, గౌడ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు పులి మోహన్ గౌడ్, గోపాల్ పూర్ గౌడ సంఘం అధ్యక్షులు చింత రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ దూలం సదానందం గౌడ్ , దూలం రాజేందర్ గౌడ్, దూలం పరమేశ్ గౌడ్, చుంచు శ్రావణ్ గౌడ్, కాసగోని లవన్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రుద్రోజు మనింద్రనాథ్, భూక్యా విజయ్ కుమార్ లు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ మత్స్యగిరి స్వామి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. యాగ్నికులు వీరవెల్లి వేణుగోపాలచార్యులు, ఆలయ అర్చకులు ఆరుట్ల కష్ణమాచారి వేద మంత్రోచ్చారణల మధ్య అంకురారోహణము, విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధన పూజ, హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సామల బిక్షపతి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్రెడ్డి, కృపాకర్‌రెడ్డి, దిడ్డి రమేష్, గన్ను వేణుగోపాల్, కాంబత్తుల ప్రకాష్, అనుకారి అశోక్, గొట్టిముక్కుల చంద్రప్రకాష్, మహిళలు పాల్గొన్నారు.

భారత్ వైపు ప్రపంచ దేశాల చూపు : ఈటెల

నవతెలంగాణ-కాశిబుగ్గ



ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయని మాజీ మంత్రి, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జల ప్రేమేందర్ రెడ్డికి మద్దతుగా ఓసిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు క్యాంపుకార్యాలయంలో తూర్పు నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఓటర్స్ తో సమావేశం నిర్వహించగా ఈటెల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్, వరంగల్ అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వరంగల్ పార్లమెంటు ప్రబారి మురళీధర్ గౌడ్, రాష్ట్ర నాయకులు డాక్టర్ విజయ చందర్ రెడ్డి, జ్యోతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసును గంటలోనే ఛేదించిన ఎస్సై

నవతెలంగాణ-శాయంపేట

ప్రేమ వివాహం చేసుకున్న కూతురిని, ఆమె భర్తకు తెలవకుండా ఆమె తల్లి, అమ్మమ్మతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు ఆటోలో తీసుకొని వెళ్లగా, భర్త తన భార్యను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు మేరకు గంటలోపు కిడ్నాప్ కేసును ఛేదించి భార్యను భర్తకు అప్పగించినట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన మునుకుంట్ల తరుణ్ గత రెండునెలల క్రితం హన్మకొండ పట్టణం పెగడపల్లికి చెందిన ఆకుల బిందును ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ సమయంలో ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్ లో సంప్రదించగా ఎస్సై ప్రమోద్ కుమార్ తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించి వేసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బిందు తల్లి ఆకుల కవిత, అమ్మమ్మ అన్యం విజయతో పాటు మరో ముగ్గురువ్యక్తులు ఆటోలో ప్రగతిసింగారం గ్రామానికి చేరుకొని తరుణ్ లేని సమయంలో బిందును బలవంతంగా ఆటోలో ఎక్కించుకొని తీసుకు వెళ్లినట్లు తెలిపారు.

విషయం తెలుసుకున్న తరుణ్ స్థానిక పోలీస్ స్టేషన్లో తన భార్యను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు ఇవ్వగా, కేసు నమోదు చేసి ఫిర్యాదు ఇచ్చిన గంటలోపే ఆధునిక టెక్నాలజీని వినియోగించుకొని నిందితులను పట్టుకొని బిందును అతని భర్త తరుణ్ కు అప్పగించినట్లు తెలిపారు. నిందితులను త్వరితగతిన పట్టుకున్న ఎస్ఐ ప్రమోద్ కుమార్, కానిస్టేబుల్ సాధన్, నాగరాజులను, పరకాల ఎసిపి కిషోర్ కుమార్, శాయంపేట సర్కిల్ సిఐ రంజిత్ రావు అభినందించారు.

కరెంటు షాక్‌తో యువకుడి మృతి

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి యువకుడు మృతి చెందడంతో పాటు మరికొందరికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చేరిన ఘటన వరంగల్ నిట్ సమీపంలోని బ్లూ జిమ్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నిట్ సమీపంలో గల బ్లూ జిమ్ లో దర్గా కాజీపేటకు చెందిన విజయ్ అటెండర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రైవేట్ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. మంగళవారం ఉదయం జిమ్ లో పనులు చేస్తున్న క్రమంలో జిమ్ ఫ్లెక్సీ బోర్డును తొలగించడానికి జిమ్‌కస్టమర్లైన కొందరితో కలసి పై అంతస్తుకు వెళ్లి తాడుతో లాగుతున్న క్రమంలో భవనానికి అనుకొని ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు ఫ్లెక్సీబోర్డు తగలడంతో విద్యుత్ షాక్‌తో విజయ్ సంఘటనా స్థలంలోనే మృతిచెందగా అతనికి సాయపడిన కొందరు వ్యక్తులు గాయపడగా వారిని చికిత్స నిమిత్తం ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు.

డ్రైనేజీ దుర్గంధంతో గ్రామస్తుల ఇక్కట్లు

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల పరిధిలోని పాత ముగ్దుంపురం గ్రామంలో నెక్కొండ-నర్సంపేట ప్రధాన రహదారి పక్కనే డ్రైనేజీ, వాటర్‌ప్లాంట్ నీరు రోడ్లపైకి వస్తుండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. స్థానికులు మురుగునీటి సమస్యను పరిష్కరించాలం టూ ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలోనే పరిస్థితి ఇలా ఉంటే వచ్చే వర్షాకాలంలో మరి పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే అవకాశం ఉందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ నిర్మాణ సమయంలో కాలువ నిబంధనలకు పాతర వేయడంతో లెవెల్ సక్రమంగా చేయకపోవడంతో వాటర్ ప్లాంట్ నుంచి వచ్చే వృథా నీరు వెళ్లకుండా ఇండ్ల మధ్యనే నిలిచిపోతుందని అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చేయాలని కోరుతున్నారు.

భగవద్గీత శ్లోకాలకు బంగారు పతకాలు

నవతెలంగాణ-జఫర్‌గడ్



భగవద్గీత 18 అధ్యాయాల్లోని శ్లోకాలను పఠించిన ఇద్దరు మహిళలు అంచూరి కమల, దాంశెట్టి శ్రావ్యలకు గణపతి సచ్చిదానంద స్వామి వారి చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారు. మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద స్వామి దత్త పీఠం వారు ప్రపంచ వ్యాప్తంగా భగద్గీత కంఠస్థ ఆన్‌లైన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో జఫర్‌గడ్ గ్రామానికి చెందిన అంచురి కమల, దాంశెట్టి శ్రావ్యలకు ప్రతిభ పాటవాలు చూసి వారికి బంగారు పతకాలు సచ్చిదానంద స్వామి అందజేశారు. వీరికి జఫర్‌గడ్ ఆర్యవైశ్య సంఘం, గణపతి నవ రాత్రి ఉత్సవ కమిటీ తరపున అభినందనలు తెలిపారు.

కార్పొరేట్ కళాశాలలో...
ఉచిత ఇంటర్మీడియట్ ప్రవేశాలు

- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.రవీందర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన కార్పొరేట్ కళాశాలలో ఉచిత రెండేళ్ల ఇంటర్ విద్యను అందించేందుకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కార్పొరేట్ కళాశాలలో ప్రవేశం పొందేందుకు విద్యార్థులు 10వ తరగతిలో 7.0 ఆ పైన జీపీఏ సాధించిన బీసీ, ఈబీసీ ప్రభుత్వ పాఠశాలలో చదివిన పేద విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ ధృవపత్రాలు కులం, ఆదాయం, నివాసం పత్రాలతో మే 30 లోపు దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

తెరుచుకున్న వాటర్ ప్లాంట్

- 'నవతెలంగాణ' కథనానికి స్పందన

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



చిల్పూర్ మండలంలోని క్రిష్టాజీ గూడెంలో వాటర్ ప్లాంటు మూత అనే నవతెలంగాణ దినపత్రికలో వెలువడిన కథనానికి స్పందించిన పంచాయితీ అధికారులు మంగళవారం మినరల్ వాటర్ ప్లాంటును తెరిపించారు. ఈ విషయమై పంచాయితీ కార్యదర్శి తండా రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రెండేళ్ల పరిమితి కాలంతో గ్రామ పంచాయితీ ఒప్పందంతో వాటర్ ప్లాంటు నిర్వహణ అప్పజెప్పామని, ఈ జూన్ నెలతో ఆ ఒప్పందం ముగుస్తుంది. కానీ వాటర్ ప్లాంటులో మిషన్ పాడైందని, బాగు చేయకుండా నిర్వహకుడు ఇష్టారీతిన వ్యవహరించగా, పలు మార్లు నోటీసులు ఇచ్చినా, నిర్లక్ష్య ధోరణితో సమస్య తలెత్తిందని అన్నారు. ప్రస్తుతం ప్రమాణాలతో కూడిన నీటిని అందిస్తున్నామని, త్వరలోనే ఓస్వచ్ఛంధ సంస్థతో కూడా ప్రజలకు మెరుగైన త్రాగునీటి అందించే ప్రయత్నం చేస్తున్నామని, జూన్ నెలలో ఒప్పందం ముగిసిన వెంటనే, గ్రామ పంచాయితీ తీర్మానంతో చర్యలు తీసుకుంటామని, ప్రజలు సహకరించాలని కోరారు.



ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని పార్టీ కార్యకర్తలు, నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ అధికారంలో ఉన్నప్పుడు పేద, బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలను కొనియాడారు. యువతకు సాంకేతిక విద్యను అందించేందుకు రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారన్నారు. ఓటు హక్కును 21 సంవత్సరాలనుండి 18 సంవత్సరాలకే తగ్గించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, మహిళా కాంగ్రెస్ పట్టణాధ్యక్షురాలు జక్కుల అనిత, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి, పట్టణాధ్యక్షులు సంచారము బుచ్చిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శివరాజ్ యాదవ్, పీఎసిఎస్ చిడకోడూరు డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, నరసింగరావు, కృష్ణస్వామి, కట్ట కృష్ణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జఫర్‌గడ్ : రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి స్టేషన్ ఘనపూర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ తాటికాయల రాజేందర్ పూలమాలలు వేసిన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తిప్పరబోయిన కృష్ణ, సముద్రాల రాజు, మాజీ వార్డు మెంబర్ కుక్కల ఎల్లయ్య, నాయకులు కొమురయ్య, బాలయ్య, మల్లయ్య, నర్సయ్య, ఎల్లస్వామి,మల్లయ్య యూత్ నాయకులు, మహిళా నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితర నాయకులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట : రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహాత్మ చారి, కర్రే నరేష్, ఎంపీటీసీ పుష్ప బాలకిషన్ గౌడ్, టౌన్ ఉపాధ్యక్షులు కవ్వం రాజిరెడ్డి, గంధమల కిష్టయ్య, ఎండి గౌస్, లక్కర్స్ వెంకటేష్, ఎండి యూసుఫ్, దాచేపల్లి రాజయ్య, గుర్రపు బాలరాజు, నర్రా మహేందర్ రెడ్డి, బోడిగం వెంకటరెడ్డి, భాస్కరాచారి, దిడ్డిగ రమేష్, అవధూత శ్రీనివాస్, దేవరకొండ రమేష్, నీల మల్లేశం, అల్వాల్ ఉప్పలయ్య, సూత్రమే రామకృష్ణ, మోహిన్ రెడ్డి, ఎండి యాకూబ్, మినాపురం సిద్దులు, వేముల భద్రయ్య, కొండ హరికృష్ణ, జంగిటి సిద్దులు, అల్వాల బిక్షపతి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొడకండ్ల : రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు సురేష్ నాయక్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆశయాలను సాధించాలంటే రాహుల్ గాంధీతోనే సాధ్యమని, కాబోయే దేశ ప్రధాని రాహుల్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు రవీందర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన కౌశిక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



ఎంసెట్ ఎంట్రన్స్ పరీక్షలో పట్టణానికి చెందిన జొన్నల కౌశిక్ ఉత్తమ ర్యాంక్‌ను సాధించాడు. 5523 ర్యాంకును సాధించినట్లు విద్యార్థి తండ్రి జొన్నల కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. ఓసి సామాజిక వర్గానికి చెందిన ఈ విద్యార్థికి రాష్ట్రంలోని టాప్ టెన్ కళాశాలలో ఉచిత సీటు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కౌశిక్‌ను పలువురు ఆవోపా ప్రతినిధులు వ్యాపారులు, అభినందించారు.

గ్రామ స్థాయిలో విత్తన డీలర్ కేంద్రాల పర్యవేక్షణ

- జిల్లా ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి

నవతెలంగాణ-జనగామ

గ్రామస్థాయిలో ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువుల కేంద్రాలను పరిశీలించాలని జిల్లా ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి అధికారులను ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా జనగామ మండలం గానుగుపహాడ్ గ్రామంలోని రైతు వేదికలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌తో కలిసి జిల్లా ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి మంగళవారం అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వానాకాలం పంటపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ వానాకాలం పంటపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత వహిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువుల కేంద్రాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎక్కడైనా ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే స్పందించి, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. విడి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయకూడదన్నారు. అదే విధంగా ప్యాక్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు విత్తనాలు, ఎరువులపై షార్ట్ ఫిల్మ్ ద్వారా, పల్లెల్లో రైతు సమావేశాలు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రైతులు అవగాహన పొందేందుకు గాను రైతు వేదికల్లో పోస్టర్‌లు, బ్యానర్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకింగ్ కవర్, రసీదును రైతులు ఎంతో జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సీఎస్ శాంతి కుమారి ఆదేశాల మేరకు విత్తనాలు, ఎరువుల డీలర్‌లు తప్పనిసరిగా రైతుల వారీగా మూడు రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థాయిలో ప్రతి రోజూ ఎంఏఓలు, ఏఈఓలు విత్తనాలు, ఎరువుల డీలర్ కేంద్రాలను సందర్శించి, అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించాలని, క్షుణ్ణంగా రిజిస్టర్‌లను తనిఖీ చేయాలని, రోజూ వారీ నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా కూడా ఎరువుల కొరత లేకుండా చూడాలని తెలిపారు.



అనంతరం పాలకుర్తి మండలంలోని ఎల్లరాయిని తొర్రూరు గ్రామ పంచాయతీలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, పర్యవేక్షించారు. ఈసందర్భంగా ధాన్యం తేమ శాతం, కొనుగోళ్లపై వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ధాన్యం బస్తాలను లారీల్లోకి త్వరితగతిన లోడింగ్ చేసి మిల్లులకు వెంటనే తరలించాలని సూచించారు. రైతులు, ధాన్యం కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలుకు సంబంధించి వారి ఖాతాల్లో డబ్బులు జమ అయిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకన్న, డీఏఓ వినోద్ కుమార్, డీసీఎస్ఓ రోజా రాణి, డీఎం సీఎస్ ప్రసాద్, పాలకుర్తి తహసీల్దార్ వెంకటేశం, డీటీలు శ్రీనివాస్, దేవా, ఏఈఓలు, రైతులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యం భయం... భయం... ప్రాణ సంకటం...

- శివునిపల్లిలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు
- తొలగించాలని కోరుతున్న బాధితులు

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

యమపాశాలుగా విద్యుత్ తీగలు ఇండ్లపై వేళాడుతున్నాయి. ఎప్పుడు ఏ విధంగా ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఎంత జాగ్రత్త వహించినా రెప్పపాటు పొరపాటుతో ప్రాణాలు పోయే ప్రమాదముంది. అటువంటి కరెంట్ తీగలు నేరుగా ఇంటిపైనే వేళాడుతుంటే భయంభయంతో బతుకెళ్లదీస్తున్నారు. విద్యుత్ అధికారులు కరెంట్ తీగలు ఇంటిపై నుంచి తొలగించాలని బాధితులు కోరుతున్నారు. మండలంలోని శివునిపల్లిలోని 13వ వార్డులో రడపాక యాదగిరి ఇంటిపై విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. ఇంట్లో నివసిస్తున్న వారంతా నిత్యం భయం భయంగా ఉంటున్నారు. ముఖ్యంగా ఇంట్లో చిన్న పిల్లలు ఉండడంతో ఎక్కడ ఇంటి మీదకి వెళ్లి కరెంట్ తీగలను పట్టుకుంటారో అని హడలిపోతున్నారు. మేడపై ధాన్యం కానీ, బట్టలు కానీ ఆరబెట్టుకోవాలన్న భయపడుతున్న పరిస్థితి. విద్యుత్ తీగలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉందని, విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందని విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. విద్యుత్ స్తంభాలను ఉన్నచోట నుండి మార్చి పెద్ద స్తంభాలను వేసి వైర్లు పైకి లాగాలని, లేక ఇంటికి ప్రమాదం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నెలనెల విద్యుత్ బిల్లులను వసూలు చేయడంపై అధికారులు చూపుతున్న శ్రద్ధ ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించడంలో లేదని, పైగా విద్యుత్ తీగలను తొలగించమని కోరినా ఫలితం లేకుండా పోయిందని, రాబోయేది వానాకాలం కావడంతో ఎర్త్ వంటి సమస్యలేమైనా తలెత్తి ప్రమాదం సంభవించినాక, అధికారులేవరైనా స్పందిస్తారా..? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ప్రమాదం పొంచి ఉంది : రడపాక యాదగిరి

ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందని విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. విద్యుత్ తీగలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. విద్యుత్ స్తంబాలను ఉన్నచోట నుంచి మార్చి పెద్ద పోల్స్ వేసి వైర్లు పైకి లాగాలి.

విద్యుత్ తీగలను తొలగించాలి : వెంకటలక్ష్మి

నెల నెలా విద్యుత్ బిల్లులును వసూలు చేయడంపై అధికారులు చూపుతున్న శ్రద్ధ ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించడంలో లేదు. మా ఇంటిపై విద్యుత్ తీగలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

ప్రమాదం జరగకముందే స్పందించాలి : రడపాక నర్సింహా

అకస్మాత్తుగా తెలియకుండా డాబా ఎక్కితే పెను ప్రమాదం సంభవిస్తుందని, ప్రమాదం జరిగితే తప్ప స్పందించరా..? ఇకనైనా అధికారులు స్పందించి ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకునే కంటే ప్రమాదం జరగక ముందు చర్యలు తీసుకుంటే బాగుంటుందని కోరుతున్నారు.







పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తాం...

శివునిపల్లి ఏఈ శ్రీకాంత్‌ను **'నవతెలంగాణ'** వివరణ కోరగా ఈ సమస్య ఇంతకు ముందు ఎప్పుడూ తమ దృష్టికి రాలేదని, విద్యుత్ తీగలను తొలగించడానికి ఒకవేళ గ్రామ పంచాయితీ నుండి తీర్మాణం ఇస్తేనో, ప్రత్యేక నిధులు ఉంటేనో సమస్య పరిష్కారం అవుతుందని, లేదంటే విద్యుత్తు తీగలను తొలగించడానికి అయే ఖర్చు ఇంటి యజమాని భరిస్తాను అంటే తీగలను తొలగించడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదని, సమాధానం ఇచ్చారు. ఏదేమైనా క్షేత స్థాయిలో పరిశీలించి, సమస్యను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని అన్నారు.

- శ్రీకాంత్, ఏఈ, శివునిపల్లి

బీజేపీపై పోరాడే సీపీఎంకు మద్దతుగా నిలవాలి

- సన్న, దొడ్డు వడ్లనే తేడా లేకుండా బోనస్ అందించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ. అబ్బాస్
- తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా గెలిపించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

మోడీ ప్రధానిగా ఉండి దేశ ప్రజల మధ్య విభజనలు తెచ్చే తీరును సీపీఎం పార్టీగా తీవ్రంగా నిరసిస్తున్నామని, ఏదైతే ప్రజల్ని విభజించాలని దురుద్దేశ పూర్వకంగా పనిచేస్తున్న బీజేపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా, ప్రజలకు భారంగా మారుతున్న నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా, రాబోవు రోజుల్లో సీపీఎం పోరాటాలకు ప్రజలు మద్దతివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ పిలుపు నిచ్చారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో భాగంగా కేవలం సన్నవడ్లకు మాత్రమే బోనస్ అందిస్తామని ప్రకటించారని, సన్న, దొడ్డు రకం వడ్లనే తేడా లేకుండా రైతు పండించిన వరి ధాన్యానికి బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్ మొదలైన క్రమంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని, దీంతో పాటుగా చెరువులు, కాలువలు మరమ్మత్తులు జరిపి చెరువులలో, కుంటలలో నీటిని నింపి, రైతులందరికీ సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసే విధంగా, తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచనలు ఇస్తున్నా, అక్కడక్కడా అధికారులు సుముఖంగా లేరని, తద్వారా రైతులు ఆందోళన చెందే అవకాశం ఉందని అన్నారు. స్టేషన్‌ఘనపూర్ మునిసిపాలిటీ కావల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, జనరల్ డిగ్రీ కళాశాల, లెదర్ పార్క్ పునరుద్ధరణ, టెక్స్టైల్ పార్కు వంటి గతంలో హామీలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి గతంలో టిడిపిలో ఉన్నప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ప్రస్తుతం కూడా ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులపట్ల తనపై ఎంతో బాధ్యత ఉన్నదని గుర్తు చేశారు. దేశంలో ఎన్నికల కమిషన్ నిష్పాక్షపాతంగా వ్యవహరించకుండా, అనేక దఫాలుగా ఎన్నికల నియమావళిని బీజేపీ ఉల్లంఘిస్తున్నదని, సీపీఎం పలుమార్లు ఫిర్యాదులు, లేఖలు అందించినప్పటికీ ఎన్నికల కమిషన్ స్పందించకుండా, బీజేపీ పట్ల పక్షపాతంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. తద్వారా దేశంలో ప్రజాస్వామ్యంపై గౌరవం కోల్పోయే ప్రమాదం ఏర్పడుతున్నదన్నారు. పారదర్శకంగా నిష్పక్షపాతంగా, ప్రజలకు జవాబుదారీతనంగా, విశ్వాసాన్ని కోల్పోకుండా వ్యవహరించాలన్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధంగా ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ఎన్నికల కమిషన్ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండియా కూటమిలో భాగమైన సీపీఎం సూచన మేరకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓట్లేసి గెలిపించాలని మండల కార్యదర్శి మునిగెల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, రాపర్తి సోమయ్య, సింగారపు రమేష్, మండల కార్యదర్శి మునిగెల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ షబానా, బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, బోడ నరేందర్, చిట్యాల సోమన్న, పి.ఉపేందర్, బి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్నను గెలిపించాలి : కాంగ్రెస్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు, పిసిసి సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నకు గ్రామ గ్రామాన ఉన్న పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి మల్లారెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు జక్కుల అనిత వేణుమాధవ్, వార్డు అధ్యక్షులు జనార్ధన్, సంజీవరెడ్డి, ప్రవీణ్, సిద్ధులు, మైనార్టీ నాయకురాలు మున్నీ బేగం తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : ప్రజల కోసం పోరాటం చేసే తీన్మార్ మల్లన్నను గెలిపించాలని మండల కేంద్ర పట్టభద్రులను కోరారు. ఈ ప్రచారంలో నాయకులు కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు కోడూరి మహాత్మ చారి, నల్లగొని బాలకిషన్ గౌడ్, దిడ్డిగ రమేష్, మాజీ వార్డ్ మెంబర్ దేవరకొండ రమేష్, గుర్రపు బాలరాజు, అవధూత శ్రీనివాస్, కొండా హరికృష్ణ, కర్రి నరేష్ పాల్గొన్నారు.

రాకేష్ రెడ్డికి పట్టం కట్టాలి : మాజీ ఎమ్మెల్యే

లింగాలఘనపురం : పట్టభద్రులు రాకేష్ రెడ్డికి పట్టం కట్టాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని లింగాలఘనపూర్ బూత్ స్థాయి ఇంచార్జిల సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ తరపున ఒక విద్యావంతుడు పోటీ చేస్తున్నాడు. కాంగ్రెస్ తరపున ఒక బ్లాక్‌మెయిలర్ పోటీ చేస్తున్నాడు. శాసనమండలిలో నిజాయితీతో కూడిన తెలంగాణ గళం వినిపించాలంటే, అదే మన ఏనుగుల రాకేష్ రెడ్డిని శాసన మండలికి పంపాలి. ఈ కార్యక్రమంలో ఎంపిపి చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శేఖర్, భాస్కర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, శ్రీవారి, విష్ణు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలి

- జఫర్‌ఘడ్ ఏఈకు రైతులు, సీపీఎం నేతల వినతి

నవతెలంగాణ-జఫర్‌గడ్



మండలంలోని ఓగలపూర్ గ్రామంలో లైన్‌మెన్‌గా పనిచేస్తూ రైతుల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న లైన్మెన్ అన్వర్ పాషాపై చర్యలు తీసుకోవాలని రైతులు, సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఈకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల జోన్ బాధ్యులు వడ్లకొండ సుధాకర్, రాజు మాట్లాడుతూ నక్క ఎల్లమ్మ, వల్లాల కొమురయ్య రైతుల వద్ద బోరు బావుల శాంక్షన్, ట్రాన్స్ఫార్మర్ విద్యుత్ స్తంభాల మంజూరు కొరకని 45,000 రూపాయలు డబ్బులు వసూలు చేసి సరిగా స్కెచ్ గీయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ట్రాన్స్ఫార్మర్ బిగించకుండా సంవత్సర కాలం నుండి ఇబ్బందులకు గురి చేస్తున్నా డని అన్నారు. విద్యుత్ ఏఈ పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో ఇలాంటి సంఘట నలు పునరావృతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలు మార్లు విద్యుత్ ఏఈ ఆఫీసు చుట్టూ నెలల తరబడి చెప్పులు అరిగేలా తిరిగిన నిర్లక్ష్యంగా సరైన సమాధానం చెప్పకుండా దాటవేస్తూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఏఈ, డిఈ తక్షణమే స్పందించి అదనంగా వసూలు చేసిన డబ్బులను తిరిగి రైతులకు ఇప్పించి, ట్రాన్స్ఫార్మర్ విద్యుత్ స్తంభాలు బిగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నక్క ఎల్లమ్మ, నక్క బిక్షపతి, వల్లాల కొమురయ్య, ఎండి శంషొద్దీన్, వల్లాల కొమరమ్మ పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని...
పురుగుల మందు డబ్బాతో నిరసన

- తహసీల్దార్ హామీతో సద్దుమణిగిన వివాదం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



పట్టదారు పాసుపుస్తకంపై బ్యాంకులో ఋణం ఉన్నప్పటికీ, ఏలాంటి భూమి ఆధారిత పత్రాలు లేకుండానే రెవెన్యూ అధికారులు తన భార్య పేరిట ఉన్న వ్యవసాయ భూమిని మరొకరి పేరిట చేశారని ఆరోపిస్తూ తక్షణమే అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని మంగళవారం చిల్పూర్ మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట అదే గ్రామానికి చెందిన బోల్ల రాజ్ కుమార్ పురుగుల మందు డబ్బా పట్టుకుని తన తల్లితో నిరసనకు దిగారు.తహసిల్దార్ సరస్వతి రిజిస్ట్రేషన్ తిరిగి రద్దు చేస్తానని హామీ ఇవ్వడంతోపోలీసుల చొరవతో, వివాదం సద్దుమణిగింది. అనంతరం బోల్ల రాజ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల అనివార్య కారణాలతో, కుటుంబంలో తన భార్య స్వప్నతో కొద్దిపాటి గొడవలు తలెత్తడంతో తనకు ఎలాంటి సమాచారం లేకుండా, రెవిన్యూ అధికారులు సర్వే నెంబర్లు 557, 559/ఏ/1, 562లో గల తన భార్య పేరిటనున్న చిల్పూర్ గ్రామ శివారులోని ఎకరా 24గుంటల భూమిని ఎలాంటి పత్రాలు లేకుండా, పట్టాదారు పాసుపుస్తకం లేకుండానే వ్యవసాయ భూమిని, హన్మకొండ జిల్లా, కాజీపేట మండలం, రాంపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రిజిస్ట్రేషన్ అయినట్లు ఉందని, పట్టాదారు పాసుపుస్తకంతో బ్యాంక్‌లో ఋణం కూడా ఉందని, అక్రమంగా రిజిస్ట్రేషన్ కావడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, రెవెన్యూ అధికారులు స్పందించి, తక్షణమే ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి న్యాయం చేయాలని, లేదంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యే శరణ్యమని అన్నారు.

కడియం సారూ... కనికరించండి మీరూ...

- ఎవ్వరూ లేరనే మమ్మల్ని పట్టించుకుంటలేరు
- నిరుపేద కుటుంబం వేడుకోలు

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

మేడిపండు పెద్దమనిషి మోసం చేసిండని... ఎమ్మెల్యే కడియం శ్రీహరి సారూ... కనికరించాలి మీరూ.. అంటూ పలు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతున్న ఘటన స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని రఘునాథపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాళ్యోకెళితే... మండల కేంద్రానికి చెందిన పెర్నే పుష్ప తన భర్త బాలరాజు అకాల మరణం చెందగా, రైతు భీమా ద్వారా వచ్చిన డబ్బులను, ఇంటి పక్కనే ఉన్న ఓ పేరున్న మాజీ ప్రజా ప్రతినిధి, పెద్ద మనిషిగా చెలామణి అవుతున్న ఒకాయన తన అవసరం కోసం రూ.4 లక్షల 50 వేలను తీసుకుని 6 నెలల్లో ఇస్తానని చెప్పి నమ్మబలికి, పలుమార్లు అడిగినా తన దగ్గర డబ్బులు లేవని, అందుకు గానూ భూమి రాసిస్తానని చెప్పి, ఖరీదు చేయగా అదనంగా రూ. 2 లక్షల 70 వేలు చెల్లించినా, రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్నాడని, సరేననుకుని భూమి మీదకు వెళ్తే అదికాస్తా వివాదంలో ఉన్నట్లు తేలిందని, కోర్టు కేసు ముగిసిన తర్వాత రాసిస్తానని నానాతిప్పలు పెడుతున్నారని, పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయని, ఏం చేసుకుంటారో.. చేసుకోండని.. బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఏ దిక్కులేక స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట కొడుకు, కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేసినా, ఇప్పటికైనా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
మహబూబాబాద్
బుధవారం | మే 22, 2024 | www.navatelangana.com

దళిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : వెంకన్న



నవతెలంగాణ-మరిపెడ

మండలంలోని ఉల్లెపల్లి గ్రామంలో ఆకస్మికంగా మృతి చెందిన గుండె మహేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ గ్రామాధ్యక్షులు బొడ్డు వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బొడ్డు వెంకన్న గుండె మహేష్ మరణానికి సానుభూతిని తెలుపుతూ మృతునికి కుటుంబానికి ప్రాగడ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి 3,000 రూపాయలు ఆర్థిక సాయం, అర క్వింట బియ్యం అందజేసి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెత్తమల్ల శ్రీను, ఉల్లోజు జానయ్య, గోరంట్ల విష్ణు, బొడ్డుపల్లి నాగరాజు, మాచర్ల బిక్షపతి, నవిలా సావిత్ర, చింతోజు ధనమ్మ, బంటు కర్ణాకర్, బొడ్డు ఉపేందర్, బొడ్డు వీరన్న, గోరంట్ల రామయ్య, మన్నెం నరేష్, బంటు కృష్ణ, ఉల్లెందుల ప్రభాకర్, కోల వీరన్న, బొడ్డు గురు బాబు, మన్నెం మల్లేష్, చలమల్ల మహేష్ రెడ్డి, మద్దోజు మురళి, బొడ్డు సురేష్, యూత్ నాయకులు, కాలనీ వాసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య : ప్రిన్సిపల్ రమేష్



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

ప్రభుత్వ కళాశాలలో ప్రైవేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీ.రమేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల చేరికకు మంగళవారం మండలంలోని అమ్మాపురం, గుర్తూరు, చీకటాయపాలెం, నాంచారి మడూర్ గ్రామాల్లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ కళాశాలలో అందుతున్న విద్యా సౌకర్యాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో అనుభవం గల అధ్యాపకులతో విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనం అందుతుందన్నారు. అన్ని గ్రూపుల్లో ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో బోధన ఉంటుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉప్పలయ్య, సువర్ణ, నరసయ్య, మల్లయ్య, శివరామకృష్ణ, అలీ, రాజేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో గణనీయంగా మత్స్యరంగం అభివృద్ధి

- రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ బి. గోపి



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

రాష్ట్రంలో మత్స్య రంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందని మత్స్య శాఖ కమిషనర్ బి.గోపి తెలిపారు. మంగళవారం మండలంలోని వెలికట్ట శివారు మిషన్ భగీరథ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ గోపిని జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల జిల్లా చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్‌ల ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు. ఉచిత చేప పిల్లల పంపిణీ కొనసాగించాలని మత్స్యకారులకు వాహనాలు అందించాలని,గతప్రభుత్వంలో అమలుచేసిన మత్స్యశాఖ అభివృద్ధి పథకాలు కొనసాగించాలని కోరారు.ఈసందర్భంగా కమిషనర్ గోపి మాట్లాడుతూ చేపల చెరువులపై దళారుల పెత్తనాన్ని నిర్మూలించి మత్స్యకారులకే పూర్తి హకులు కల్పించామని, భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలు, దేశాలకు చేపలను ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ చేరుతుందని, మహిళా మత్స్యకారులను కూడా ప్రోత్సహించడానికి వివిధ రకాల చేపల వంటకాలపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా మత్స్య సొసైటీల్లో 45 వేల మందికి పైగా సభ్యత్వం అందజేసినట్లు తెలిపారు. రూ.1,000 కోట్లతో మత్స్యకారులకు వలలు, రూ.10 లక్షల విలువైన 150 వాహనాలను 60 శాతం సబ్సిడీపై అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగమణి, ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు మారబోయిన రాంభద్రం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అవకతవకలకు పాల్పడితే చర్యలు

- రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు డాక్టర్ గోపి




నవతెలంగాణ-పెద్దవంగర

ధాన్యం కొనుగోలులో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు డాక్టర్ గోపి అన్నారు. మంగళవారం అవుతాపురం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మహబూబాబాద్ జాయింట్ కలెక్టర్ డేవిడ్, జిల్లా వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులు కొనుగోలు కేంద్రంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణ సమయంలో మిల్లర్లు అవకతవకలకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవన్నారు. ధాన్యం లోడింగ్ అన్లోడింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి మద్దతు ధర వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేసేలా అధికారులు చూడాలన్నారు. వర్షాల నేపథ్యంలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, చివరి గింజ వరకు కొనుగోలు చేపడుతామని చెప్పారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, పచ్చి రొట్టె విధానం ప్రాముఖ్యతను రైతులకు వివరించాలని వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యు, డీహెచ్ఎస్ఓ మరియన్న, డీఎం కృష్ణవేణి, జిల్లా సివిల్ సప్లై అధికారి శోభన్ బాబు, లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారి కుమార్ యాదవ్, ఏఈఓ ప్రవళిక పాల్గొన్నారు.

జీలుగా విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

- వ్యవసాయ విస్తరణ అధికారి జావేద్



నవతెలంగాణ-మరిపెడ

తెలంగాణ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై సరఫరా చేస్తున్న పచ్చి రొట్టె ఎరువులైనటువంటి జీలుగా విత్తనాలను రైతులు వేసుకొని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి జావేద్ అన్నారు. మంగళవారం మరిపెడ పట్టణ కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రం నుండి రైతులకు జీలుగా విత్తనాలను పంపిణీ చేశారు. మొక్కజొన్న మిరప వంటి ప్రధాన పంటలకు ఈ పచ్చి రొట్టె ఎరువు ఎంతో ఉపయోగపడుతుందని, జీలుగా పండించడం వలన భూమిలోని సారవంతంగా పెరిగి నీటి నిలువ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని తద్వారా రైతులకు పంటలు దిగుబడి పెరుగుతుందని ఆయన తెలిపారు. మండలంలో రైతులు ఆగ్రో రైతు సేవ కేంద్రాలలో పచ్చి రొట్టె విత్తనాలను సిద్ధంగా ఉన్నాయని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మణికంఠ, రైతు ఆగ్రో సేవ కేంద్రం ప్రోపరేటర్ గంట్ల గోపాల్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతు అగ్రోస్ సేవ కేంద్రంలో సబ్సిడీపై విత్తనాలు

దంతాలపల్లి : జీలుగు విత్తనాలు 60 శాతం సబ్సిడీపై, మండల కేంద్రంతో పాటు పెద్దాపురం గ్రామంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో లభిస్తాయని ఏఈవో సందీప్, శిరీష మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న రైతు ఆగ్రోస్ సేవ కేంద్రంలో జీలుగు, సంచులు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. కావలసిన రైతులు భూమి పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, తీసుకొని వెళ్లాలని వారు సూచించారు.

తొర్రూరు : సబ్సిడీపై జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆగ్రోస్ రైతు సేవ సంఘంలో 30 కేజీల బస్తా రూ.1,116 ఉందని, అవసరమున్న రైతులు పట్టా పాసుబుక్కు, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకువచ్చి ఆగ్రోస్‌లో తీసుకోవాలని తెలిపారు.

మాజీ సర్పంచ్, మాజీ చైర్మన్ మృతి



నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ మండలం సికింద్రాబాద్ తండా మాజీ సర్పంచ్, మహబూబాబాద్ పిఎసిఎస్ మాజీ చైర్మన్ కోడూరు రంగనాయకమ్మ అనారోగ్యంతో మంగళవారం హైదరాబాదులో మృతిచెందగా ఆమె మృతదేహాన్ని మానుకోటకు తరలించారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పూలమాలు వేసి నివాళులర్పించారు. బుధవారం అంత్యక్రియలు జరగనున్నాయి. పరామర్శించిన వారిలో ఎండి ఫరీద్, లోనవత్ అశోక్, నర్సింగ్, వెంకన్న, సాయిలు, రామచంద్ర, బాలు ఉన్నారు.

ఈతకు వెళ్లి బాలుడు మృతి



నవతెలంగాణ-బయ్యారం

ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..బయ్యారం దామర చెరువులో ఈతకు వెళ్లి అంబేద్కర్ కాలనీకి చెందిన బాలుడు జినక గౌతమ్(15) మృతి చెందినట్లు తెలిపారు. బాలుడు మృతితో వారి కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. బాలుడు ప్రస్తుతం మహాత్మ జ్యోతిబాపూలే గురుకులంలో ఎనిమిదో తరగతి పూర్తి చేసాడు. జూన్‌లో హైదరాబాదులో జరగబోయే స్టేట్ మీట్‌కి వెళ్లాల్సి ఉందని, ఇటీవల వాలీబాల్ స్టేట్ లెవెల్‌లో కూడా సెలక్షన్ అయ్యాడని తెలిపారు.

వైద్య సిబ్బంది అంకిత భావంతో పని చేయాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాకాధికారి డాక్టర్ కళావతి



నవతెలంగాణ-మహబూబాబాద్

వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది అంకితభావంతో పని చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.కళావతి బాయి అన్నారు. మహబూబాబాద్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంబేద్కర్ నగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (ఉపకేంద్రము)ను మంగళవారం సందర్శించి మాట్లాడుతూ ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో సి-సెక్షన్ కాన్పులు ఎక్కువగా అవుతున్నట్లు గుర్తించి సి-సెక్షన్ కాన్పులను తగ్గించుటకై వైద్య ఆరోగ్య సిబ్బంది, తల్లుల సమావేశంలో గర్భిణీ స్త్రీలు, వారి బంధువులకు సాధారణ ప్రసవాల వలన చేకూరే ప్రయోజనాలను సిబ్బంది వివరించాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆరోగ్య కేంద్ర పరిధిలోని క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు, అంబేద్కర్ నగర ప్రజలు కేంద్రమునకు సరియైన భవనం లేక ఇరుకు గదులలో నిర్వహిస్తున్నారని దానికి ఒక ఉప కేంద్ర భవనమును నిర్మిస్తే ఇక్కడి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని, ఆవేదన వ్యక్తం చేస్తూ భవన నిర్మాణము కొరకు స్థలం కేటాయించాలని అడుగగా, వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సమాధానం ఇస్తూ ఈ విషయాన్ని రెవెన్యూ, మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి ఉపకేంద్ర భవనమునకు స్థలం కేటాయించేటట్లు ప్రయత్నం చేస్తానని తెలిపారు. అంబేద్కర్ నగర పరిధిలోని ప్రజలు రోజువారి కూలీ చేస్తూ జీవనాధారం పొందుతున్నారని మహబూబాబాద్ జిల్లాలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ నందు అన్ని రకాల ప్రత్యేకమైన వైద్యులు అందుబాటులో ఉన్నారని ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని, ప్రైవేటు ఆసుపత్రుల మీద ఆధారపడకూడదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ బిందుశ్రీ, జిల్లా ఉప మాస్ మీడియా అధికారి కొప్పుప్రసాద్, డిపిహెచ్ఎన్ఓ మంగమ్మ, ఎన్‌హెచ్‌ఎం డిపిఎంఓ రుక్ముద్దీన్, ఆశా నోడల్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల స్వైరవిహారం - భయాందోళనలో గ్రామస్థులు



ఎంపీటీసీలు

నవతెలంగాణ-చిన్నగూడూరు

మండలంలో కోతుల బెడద రోజు రోజుకు పెరిగిపోతుంది. గ్రామాలలో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. రైతుల పంట పొలాలను ఆగం చేయడమే కాకుండా ఇళ్లల్లోకి చొరబడి చిందర వందరం చేస్తున్నాయి. ప్రస్తుతం వేసవికాలం కావడం పంటలేవి లేకపోవడంతో అవి గుంపులు గుంపులుగా గ్రామాల్లో ఇళ్లలో సంచరిస్తూ ఆహారం కోసం ఒంటరిగా ఉన్న మనుషులపై ముఖ్యంగా ఆడవారు, చిన్నపిల్లలపై దాడి చేసి గాయపరచడమే కాకుండా ఇళ్లల్లో ఆహార సామాగ్రిని ఎత్తుకెళ్తున్నాయి. ఇదే కాకుండా చిన్న పిల్లలు కిరాణా దుకాణల వద్దకు వెళ్లి బిస్కెట్లు, బ్రెడ్ వంటి పదార్థాలు తీసుకొస్తుంటే వారిపై కూడా దాడి చేసి అట్టి పదార్థాలను ఎత్తుకు వెళుతున్నాయి. కోతుల నియంత్రణకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కోతులను బంధించి అటవీ ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో జరిగిన అనేక మండల సర్వసభ్య సమావేశంలో స్థానిక మండల కేంద్రంలోని కోతులు, కుక్కల నియంత్రణ కేంద్రాన్ని (ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్) ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్న స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకోలేదు. వాటి నియంత్రణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి కోతుల బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఫలించని ప్రయత్నాలు : గ్రామస్తుడు



గ్రామాలు, పట్టణాల్లో కోతుల నివారణకు రైతులు, ప్రజలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో రైతులంతా కలిసి కొండముచ్చులను కొనుగోలు తీసుకొచ్చారు. మరికొన్ని చోట్ల బర్సర్ గన్నుల సాయంతో సౌండ్స్ చేస్తూ, డమ్మీ బొమ్మలు పెడుతూ కోతులను తరిమి కొట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీని వల్ల కోతులు పోయినట్లే పోయి మళ్లీ తిరిగి వస్తున్నాయి. మరో వైపు మంకీఫుడ్ కోర్టుల ఏర్పాటుతో సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడమే మానేసింది.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం : వెంకన్న, రైతు



కోతులు ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందర వందర చేస్తున్నాయి. ఆహార పదార్థాలు, కూరగాయలను ఎత్తుకెళ్తున్నాయి. కూరగాయలు, ఇతర పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. వీటిని తరిమేందుకు ప్రయత్నిస్తే అవి దాడులకు దిగుతున్నాయి. అధికారులు వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలి.

కోతుల బెడద ఉన్న విషయం వాస్తవమే వాటిని నిర్మూలించడం కోసం ఉన్నతాధికారుల సలహా సూచనలు మేరకు చర్యలు తీసుకుంటాం.

-ఎంపీఓ యాకయ్య

హామీల అమలులో కాంగ్రెస్ కాలయాపన

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



నవతెలంగాణ-తొర్రూరు

రాష్ట్రంలో ప్రజలను, రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పరిపాలన చేతకాక ఇచ్చిన హామీలు అమలులో కాలయాపన చేస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఎంతైనా వడ్లు పండించుకోండి రూ. 500 బోనస్ ఇచ్చి కొనే బాధ్యత నాది అని సరిగ్గా నెల రోజుల క్రితం ఏప్రిల్ 21న నిజామాబాద్ సభలో చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి నిన్న జరిగిన క్యాబినెట్ మీటింగ్ తర్వాత సన్న వడ్లు పండించిన వారికి మాత్రమే రూ. 500 బోనస్ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటనతో రైతుల పరిస్థితి అగమ్యాగోచరంగా మారిందన్నారు. తెలంగాణలో 90 శాతం మంది రైతులు దొడ్డు వడ్లు మాత్రమే సాగు చేస్తారని, కేవలం 10 శాతం మంది రైతులు మాత్రం వారి కుటుంబ అవసరాల కోసం సన్న వడ్లు పండించి మిగిలింది అమ్ముకునే వారు అని ఉన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి తెలంగాణలో అధిక శాతం దొడ్డు వడ్లే పండుతాయి దొడ్డు వడ్లకు మద్దతు ధర ఇవ్వాలని నేడు అధికారంలోకి రాగానే కేవలం సన్నవడ్లకు మాత్రమే మద్దతు ధర ఇస్తామని అనడం వారి బోగస్ మాటలకు నిదర్శనం అని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా కాళేశ్వరం ప్రాజెక్టు మీద పెద్ద ఎత్తున అసత్య ప్రచారాలతో అధికారంలోకి రాగానే నిపుణుల పర్యవేక్షణలో రిపేరు చేస్తున్నామని ఇప్పుడు అనడం వారి మోసపూరిత మాటలకు నిదర్శనం అన్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై ప్రశ్నించే గొంతుక నేను అని మా యమాటలు చెప్పి బ్లాక్‌మెయిల్ దందాలకు తెరలేపి డబ్బులు వసూలు చేసిన తీర్మానం మల్లన్నకు ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ తమ యొక్క విలువైన ఓటుతో బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 56 కేసులను ఏసుకేసుకున్న ఒక క్రిమినల్ తీన్మార్ మల్లన్న మన పట్టభద్రుల ఎమ్మెల్సీగా అర్హుడా..? లేక ఉన్నత విద్యావంతుడిగా సమాజ సేవకై రాజకీయాల్లోకి వచ్చిన ఒక విజనరీ నాయకుడు రాకేష్ రెడ్డి మన పట్టభద్రుల ఎమ్మెల్సీగా అర్హుడా...? అని ఆయన ప్రశ్నించారు. పట్టభద్రులంతా ఆలోచించి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి మన పక్షాన చట్ట సభకు పంపుదామని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

అభివృద్ధికి నోచుకోని ప్రభుత్వ పాఠశాలలు

- నత్తనడకన అభివృద్ధి పనులు



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో వచ్చే విద్య సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సౌకర్యాలు మెండుగా ఉండాలని ఉద్దేశంతో గత ప్రభుత్వ పాఠశాలల కమిటీలను రద్దుచేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ప్రవేశపెట్టి వారికి అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించింది. అంత వరకు బాగానే ఉన్నా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. మండలంలో 28 ప్రభుత్వ పాఠశాలలకు 70 లక్షల 80 వేల రూపాయల నిధులను విడుదల చేసింది. కానీ అభివృద్ధి పనులు నత్తనడకన జరుగుతున్నాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిరుపయోగంగా అమ్మ అభివృద్ధి పాఠశాల కమిటీలు..

ప్రభుత్వం పాఠశాల విద్యా కమిటీలను రద్దుచేసి మహిళా సంఘాలకు విద్య కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పజెప్పడంతో గ్రామాల్లోని గ్రామ ఐక్య సంఘ అధ్యక్షులు విద్యా కమిటీ చైర్మన్‌గా కొనసాగుతుండడంతో కొన్ని గ్రామాల్లో వారికి కనీసం నిధుల వివరాలు కూడా తెలియకపోవడంతో కమిటీలు నిరుపయోగంగా ఉన్నాయి. పాఠశాల అభివృద్ధి కమిటీల నిధులను ప్రభుత్వం చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులును జాయింట్ చెక్ పవర్‌గా చేసి నిధులను డ్రా చేసే పద్ధతిలో నియమించడంతో కొంతమంది అభివృద్ధి కమిటీ చైర్మన్‌లకు నిధుల వివరాలు పనిచేసే వివరాలు తెలియకుండానే పనులు జరుగుతున్నాయి.

అంతా ప్రధానోపాధ్యాయుల కనుసనల్లోనే పనులు...

ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే పనులు అన్ని ప్రధానోపాధ్యాయుల కనుసనల్లోనే జరుగుతున్నాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలో జరిగే పనులు వివరాలు కనీసం గ్రామ పౌరులకు ప్రజలకు తెలియకుండానే జరుగుతున్నాయి. వాటి వివరాలను కనీసం అడిగిన వారికి కూడా చెప్పకుండానే అంత కమిటీ చైర్మన్‌గా మహిళా సంఘ సభ్యులను సూచిస్తూ మాకు ఏమీ తెలియదని చెబుతున్నారని ప్రజలు అంటున్నారు. పనులు జరిగే వివరాలను మండల ఏపీఎం, ఎంపీడీవో, ఎంఈఓ చుట్టపు చూపుగా పనులను పర్యవేక్షిస్తున్నామని పాఠశాలలు తిరుగుతున్నారు తప్ప వాటి వివరాలు తెలియకుండా గ్రామైక్య సంఘ సభ్యులకు తెలుపకుండా పనులు జరుపుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలలో జరిగే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందే విధంగా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మూతపడిన బడులు తెరిపించాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ-మహబూబాబాద్

ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో మూతబడిన అన్ని పాఠశాలలను బేషరతుగా తెరిపించాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చుంచు శ్రీశైలం డిమాండ్ చేశారు.మంగళవారం టిపిటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలు వచ్చే అవకాశం ఉన్న బడులను తెరిపిస్తామన్న మంత్రివర్గ నిర్ణయం హాస్యాస్పదంగా ఉందని, ఇది ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నుంచి తప్పించుకునే ప్రయత్నమే అని అన్నారు. పిల్లలు రాకనే బడులు మూసేసిన విషయం వారికి తెలియదా..? అని ప్రశ్నించారు. పిల్లలు వచ్చేలా చేయడం ప్రభుత్వ బాధ్యతని, మంత్రులు, ప్రజాప్రతినిధులు,అధికారులు, ఉపాధ్యాయ సంఘాలతో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి, బడి మూసేసిన ప్రతీ గ్రామాన్ని కమిటీలు సందర్శించి గ్రామస్తులతో అధికారిక సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బలాష్టి రమేష్, జిల్లా కార్యదర్శులు సోమ విష్ణువర్ధన్, చీకటి ఉపేందర్, మహబాద్ మండల అధ్యక్షులు రాచకొండ ఉపేందర్, నాయకులు కోడెం శ్రీనివాస్, జి.కార్తీక్, పి.రమేష్, నాయిని సుధాకర్, బి.మోహన్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి మరొకరికి గాయాలు

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

వరంగల్ ఖమ్మం ప్రధాన జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థి మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మృతి చెందిన బానోత్ భరత్ ఇంటర్ సెకండియర్ చదువుతుండగా గుగులోత్ రఘుకు గాయాలైనట్లు ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

గార్ల : గత ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన అరాచకలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచి జర్నలిస్టుగా ప్రభుత్వ తప్పులను ఎలుగెత్తి చాటిన తీన్మార్ మల్లన్నను పట్టభద్రులు అధిక మెజార్టీతో గెలిపించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు షేక్ యాకూబ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.



దేశం కోసమే బతికిన మహనేత రాజీవ్ గాంధీ

- పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి

నవతెలంగాణ-తొర్రూరు

దేశం కోసం తన ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి దేశం కోసమే బతికిన మహనేత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ అని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి అనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చిన్న గూడూరు : దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ అన్నారు. మంగళశారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షుడు బత్తెం రమేష్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిల్లి వీరన్న, మండల ప్రధాన కార్యదర్శి సుదగాని నాగేష్, బిక్కు, దాసరి రాజు, పట్ల కిరణ్, మోహన్, అనిల్, దాసరి యాకన్న, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గార్ల : రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధనియాకుల రామారావు, జెడ్పీటీసి జాటోత్ ఝాన్సీలక్ష్మీ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు గుండా వెంకటరెడ్డి, సుందర్, బి హతీరాం, రావూజీ, వశ్యా.జి. శ్రీను, హరి, బాబూరావు, రామక్రిష్ణ, సుమంత్, జి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ : రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు, త్యాగం మరువలేమని కాంగ్రెస్ మరిపెడ పట్టణాధ్యక్షులు తాజుద్దీన్ అన్నారు. మంగళవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు భూక్యా వెంకన్న, సోమన్న గౌడ్, జాటోత్ సురేష్ నాయక్, అక్కినపల్లి వెంకట్ సాయి, జోగి రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీనివాస్, రవి, గడ్డం మల్సూర్, షేక్ సిరాజ్, గంగుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుగుర్తి : దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురెళ్ళి సతీష్ అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మంగవారం పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామాధ్యక్షుడు గంజి రాజేందర్ రెడ్డి, దేవులపల్లి వెంకన్న, మామిడి జనార్ధన్, జిల్లా నాయకులు చెన్నాల కట్టయ్య, గుజునూరు బాబురావు, కొట్టం మహేందర్, సిసిఎల్ అధ్యక్షుడు మహంకాళి సలీం, కుంచాల రమేష్, యూత్ నాయకుడు నద్దునూరి ప్రశాంత్, వెంకన్న, ప్రభాకర్, రాజు, యాకన్న కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం : మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు కంబాల ముసలయ్య, పట్టణ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, మాజీ టీపీసీసీ నాయకులు గుగులోత్ కిషన్ నాయక్, జిల్లా కార్యదర్శి ములకూరి వీరారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గార్ల మండల కాంగ్రెస్ నాయకులు, డోర్నకల్ కో ఆర్డినేటర్ జూలకంటి సీతారామ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల శ్రీనివాస్, ఎంపీటీసీ భూక్యా లక్ష్మి, తగిర సత్తిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు తగిర నిర్మల రెడ్డి, మాజీ సర్పంచ్ బోడ రమేష్, యూత్ జిల్లా కార్యదర్శి వెంకటపతి, గ్రామశాఖ అధ్యక్షులు నాగరాజు, గుంజ వీరాస్వామి, చెరుకుపల్లి నర్సయ్య, పెద్దిని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

23, 24న సీపీఐ (ఏంఎల్) రాజకీయ శిక్షణ తరగతులు

నవతెలంగాణ-ఇనుగుర్తి

23, 24 తేదీలలో దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంలో జరుగు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంద) జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంద మహబూబాబాద్ డివిజన్ నాయకులు కందాల రంగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాన్ని విడుదల చేశారు. దోపిడి శక్తులపై పోరాడాలనే లక్ష్యంతో క్లాసులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ శిక్షణలో జిల్లాలో 18 మండలాల నుండి ఎంపిక చేసిన ప్రతినిధులు హాజరవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కందుల శ్రీశైలం, కందాల యాకయ్య, మాలి రాములు, ఐలయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-మహబూబాబాద్

ఈ నెల 24న జరిగే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు (పాలిసెట్)-2024 అన్ని ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డి.శోభారాణి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. 24న ఉదయం 11 నుంచి మాధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించేది లేదని తెలిపారు. పరీక్షకు వచ్చేవారు హాల్ టికెట్, పెన్సిల్, బాల్‌పాయింట్ పెన్ తీసుకొని రావాలని తెలిపారు. పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ప్రక్కన గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, తక్షశిల హై స్కూల్, పోస్ట్ ఆఫీస్ వద్ద ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్, శ్రీ చైతన్య ఈ టెక్నో స్కూల్, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ పక్కన గల గవర్నమెంట్ హై స్కూల్, రైల్వే స్టేషన్ రోడ్డులోని గవర్నమెంట్ బాలికల జూనియర్ కళాశాలలో మొత్తం (6) సెంటర్లలో 1,609 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, విద్యార్థులు పరీక్ష హాలులోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని ఆమె పేర్కొన్నారు.


కార్గిల్ రాంబాబుకు టీటీఏ ఆహ్వానం



నవతెలంగాణ-మరిపెడ

మరిపెడ (బంగ్లా)లో కార్గిల్ సెంటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు గాదె రాంబాబుకు తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ తరపున మహాసభలకు హాజరవ్వాల్సిందిగా గౌరవ ఆహ్వానం పంపించింది. వాషింగ్ టన్ అసోసియేషన్ మెగా కన్వెన్షన్ సెంటర్లో అధ్యక్షుడు వంశీ రెడ్డి కంచరకుంట్ల ఆధ్వర్యంలో మే 24 నుంచి 26 వరకు అగ్రరాజ్యంలో నిర్వహిస్తున్న మహాసభలకు ఆయన హాజరు కానున్నారు. తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) ప్రముఖ జాతీయ స్వచ్ఛంద సంస్థ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో నివసిస్తున్న తెలుగు సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన గాదె రాంబాబు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి వాషింగ్‌టన్ మహాసభలకు హాజరవ్వాల్సిందిగా ఆహ్వానం పంపించింది. ఆహ్వానం అందటం సంతోషంగా ఉందన్నారు.

పోలీసుల ఆదుపులో గంజాయి ప్యాకెట్స్..?



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

తొర్రూర్ మండలం కస్నా తండాలో నమ్మదగిన సమాచారం మేరకు ఆబ్కారీ పోలీసులు, కస్నా తండాకు చెందిన బానోత్ సోమన్న స్థలంలో గంజాయి ప్యాకేట్స్, డమ్మీ పిస్తోల్ ఆకారంలో ఉన్న లైటర్ దొరికినట్లు సమాచారం. అదేవిధంగా పట్టుకున్న గంజాయి 30 ప్యాకెట్స్ దొరికినట్లు సమాచారం. వాటి విలువ సుమారుగా రూ.30 నుంచి రూ. 40 వెయ్యిల మధ్య ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని ఆబ్కారీ పోలీసులు తెలిపారు.

'అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది'

నవతెలంగాణ-మల్హర్‌రావు



అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహచరుడు మహేందర్ యాదవ్, యూత్ కాంగ్రెస్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మండల రాహుల్ అన్నారు. మండలంలోని చిన్నతూండ్ల గ్రామానికి చెందిన యూత్ కాగ్రెస్ నాయకుడు సుదమల్ల వెంకటేష్ ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంత్రి దుద్దిళ్ల ఆదేశాల మేరకు మహేందర్ యాదవ్, రాహుల్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి వెంకటేష్ ఆరోగ్య పరిస్థితిని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. వెంకటేష్ ఆపరేషన్‌కు బ్లడ్ అవసరం ఉండగా రాహుల్ డొనేట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాము,వెంకటేష్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పరామర్శ

నవతెలంగాణ - ములుగు



ములుగు మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ల్యాద శ్యామ్‌రావు పెద్దనాన్న రాజయ్య మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు భానోత్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, పీఏసీఎస్ చైర్మెన్ బొక్కా సత్తి రెడ్డి, జిల్లా మత్య శాఖ అధ్యక్షుడు కంబాల రవి ఆయన పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోల్కొండ రవి, శ్యామ్ రావు, మైనారిటీ సెల్ నాయకుడు అజ్జు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి పునాదులు వేసింది.. రాజీవ్ గాంధీ

- మంత్రి డాక్టర్ దనసరి సీతక్క

నవతెలంగాణ- ములుగు

గ్రామ స్వరాజ్యానికి పునాదులు వేసిందే రాజీవ్ గాంధీ అని మంత్రి డాక్టర్ దనసరి సీతక్క కొనియాడారు. హైదరాబాద్‌లోని మంత్రి సీతక్క క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ... కంప్యూటర్ విద్యను అమలు చేసి, దేశంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని అన్నారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు అనేక సంస్కరణలు తెచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాడని కొనియాడారు. పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయడంలో ఆయన ఎనలేని కృషి చేశాడన్నారు. రాజీవ్ గాంధీ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చాంద్ పాషా, ములుగు పట్టణ అధ్యక్షుడు చింతలపూడి బిక్షపతి అన్నారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో





రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక భావాలు, నిర్ణయాత్మక శక్తి కలిగిన రాజీవ్‌గాంధీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాని అని అన్నారు. భారతదేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగంలో రాజీవ్ గాంధీ అగ్రగామిగా నిల్పారని అన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోతు రవి చందర్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బాదం ప్రవీణ్ , కిసాన్



సెల్ జిల్లా కార్యదర్శి శ్యామ్, మారపు తిరుపతి (ఎంపీటీసీ), మత్స్యశాఖ జిల్లా అధ్యక్షులు కంబాల రవి, జిల్లా యూత్ సెక్రెటరీ రేవంత్ యాదవ్ , ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బోడ రఘు, ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ ఓరుగంటి అనిల్, బీసీ సెల్ మండల అధ్యక్షులు పొడల ఓం ప్రకాష్, సింగిల్ విండో డైరెక్టర్ బోయిని రాజు, ములుగు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్లావుల అశోక్, ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బోడ సతీష్, యూత్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మధు, తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట :

మండల కేంద్రంలో ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకట కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి మాట్లాడుతూ గాంధీ కుటుంబం దేశానికి చేసిన సేవలు వెల కట్టలేనివన్నారు.

మహాదేవపూర్ :

అణగారిన బతుకుల్లో వెలుగులు నింపి ఆఖరి క్షణం వరకు దేశం కోసమే బతికిన మహానేత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. మంగళవారం మండలంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అక్బర్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు, జెడ్పీటీసీ గుడాల అరుణ, పీఏసీఎస్ చైర్మన్ సల్ల తిరుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కటకం అశోక్, మైనార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆశ్రార్‌లిఖురేషి, మండల ప్రధాన లికార్యదర్శి తిరుపతిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వామన్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, సమ్మయ్య, ధర్మయ్య, వడ్ల సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు కడాల నాగరాజు, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య కార్యకర్తల సేవలు అభినందనీయం : ఏఎస్ఓలు



నవతెలంగాణ-గణపురం

కరోనా కష్ట కాలంలో ఫ్రంట్ లైన్ వారియర్స్ గా ఆరోగ్య కార్యకర్తలు అందించిన సేవలు అభినందనీయమని ఏఎస్ఓలు పాయల్, మేఘా భారతి, రిషి రాజ్, పూజా సింగ్, శివం కందేల్వాల్, జై ప్రకాష్ అన్నారు. మంగళవారం చెల్పూర్ ఆరోగ్య కేంద్రం పరిధి డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఆరోగ్య కార్యకర్తల పాత్ర ముఖ్యమైనదన్నారు. గర్భిణులు, బాలింతలు, రోగులకు ఎప్పటికప్పుడు తగు సలహాలు సూచనలిస్తూ వారి యోగక్షేమాలను నిరంతరం పర్యవేక్షిస్తారన్నారు. ఉదయం గ్రామ స్థితిగతులను, పరిసరాలను పర్యవేక్షించారు. అనంతరం గ్రామంలోని వివిధ రకాల వ్యక్తులతో మాట్లాడి వారి వృత్తిని, ఆదాయాలను తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, వాటి ఉపయోగాల గురించి తెలుసుకున్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి హరిచంద్ర రెడ్డి, ముక్కెర హేమంత్, తదితరులు ఉన్నారు.

కాళేశ్వరం పీహెచ్‌సీని ఏఎస్ఓల సందర్శన



నవతెలంగాణ-మహాదేవపూర్

ఏఎస్ఓల బృందం ఐదు రోజుల పాటు వివిధ విభాగాల పరిశీలనలో భాగంగా మహాదేవపూర్ మండలం లోని కాళేశ్వరం లో మొదటి రోజు మంగళవారం కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి నేషనల్ రూరల్ హెల్త్ మిషన ఆరోగ్య కార్యక్రమాలు పరిశీలించారు. తదితర వివరాలు వైద్యాధికారిణి డాక్టర్ సుస్మితను అడిగి తెలుసుకున్నారు. ఏఎస్ఓ రమేష్, జెఈ శ్రీనివాస్, పిహెచ్ఎన్ నీరజ, హెల్త్ సూపర్‌వైజర్ సమ్మక్క హెల్త్ అసిస్టెంట్ అడప రాజరమణయ్య,సెక్రెటరీ సత్యనారాయణ, స్టాఫ్ నర్స్ కీర్తి, స్వరూప, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, ఏఎన్ఎం రాజమణి, ఫార్మాసిస్ట్ మౌనిక, డాటా ఎంట్రీ ఆపరేటర్ వెంకటేష్, ఆశ వర్కర్స్ శ్రీలత, సుశీల కంటిజెంట్ వర్కర్ మక్బుల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే



నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి మహాదేవ్‌పూర్, పలిమెల మండలాల్లోని గ్రామాలలో వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన అసిప్థమెటిక్ ఫీవర్ సర్వే మంగళవారం చేపట్టారు. గ్రామ జనాభా ప్రతిపాదిక ఆధారంగా రక్త పూతల సేకరణ చేపడుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వారు చేసే సర్వేకు గ్రామస్థులు సహకరించాలని, అంబట్‌పల్లి పీహెచ్‌సీ హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ మురళిధర్‌రెడ్డి అన్నారు. ప్రతి గ్రామంలో ఫీవర్ సర్వే జరుగుతుందని సెక్టార్ సబ్ యూనిట్ ఆఫీసర్ రమేశ్ చెప్పారు. అంబట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ రికార్డ్స్ తనిఖీ చేసి సిబ్బంది పని తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మాషూక్ అలీ, హెల్త్ అసిస్టెంట్ సత్య నారాయణ పాల్గొన్నారు.

గోశాలకు దానా బస్తాల వితరణ

నవతెలంగాణ-గణపురం

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ గోశాల గోమాతలకు దాన బస్తాలను భూపాలపల్లి జిల్లా జంగేడు గ్రామానికి చెందిన బుర్ర శ్రీనివాస్ గౌడ్ కుమారుడు బుర్ర వినోద్ గౌడ్ మంగళవారం ఆలయానికి దాన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు నరేష్ వారిని ఆశీర్వదించారు. దానా బస్తాలను అందజేసిన శ్రీనివాస్‌గౌడ్, వినోద్‌గౌడ్‌కు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో యాంసాని రాజు, హనుమాన్ మాల ధారణ భక్తులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కుల సంఘం కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-గణపురం

మండలం లోని బుద్దారం గ్రామంలో ముదిరాజ్ కుల సంఘం కుల పెద్దమనుషులుగా నిరటి గున్ని ముదిరాజ్, అచ్చునూరి రమేష్ ముదిరాజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎన్నుకోగా ఆయన శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలొ జిల్లా ఉపాధ్యక్షులు అల్లం స్వామి ముదిరాజ్,అచ్చునూరి సరంగపాణి, డైరెక్టర్ అచ్చునూరి సంపత్, కట్ల రాజు,కట్ల పవన్, మల్లవేణి రాంబాబు, సదయ్య, రమేష్, ప్రశాంత్, పోషలు, పెద్ద రమేష్, మాల నర్సయ్య ముదిరాజ్ కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీలు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారిని, కలెక్టర్ ఇలా త్రిపాఠి



నవతెలంగాణ - ములుగు

ఈ నెల 27 తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారిని, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో సమావేశమై కలెక్టర్ మాట్లాడారు. వరంగల్ -ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయన్నారు. జూన్ 5వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని, 52మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 10,299 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుష ఓటర్లు 3,712 మంది ఉండగా, మహిళా ఓటర్లు 3712 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. పట్టభద్రుల ఉప ఎన్నికలకు విధులు కేటాయించిన సిబ్బందికి ఓటు హక్కు వినియోగానికి ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకుని 22వ తేదీన ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 26వ తేదీన మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందని, అదే రోజు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని మరుసటి రోజు పోలింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. వయోవద్ధులు, దివ్యాంగుల సహాయార్థం పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్లు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కే సత్యాపాల్‌రెడ్డి, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్, డీటీ, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను ఆదరించి గెలిపించాలి

- తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమి టీ సభ్యుడు, ములుగు జిల్లా ఇన్‌చార్జి అచ్చునూరి కిషన్

నవతెలంగాణ- ములుగు

ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న'కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ములుగు జిల్లా ఇన్‌చార్జి అచ్చునూరి కిషన్ పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను, సిబ్బందిని ఓటు అభ్యర్థిస్తూ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను, ప్రజలను మోసగించిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల సాధనకు సానుకూల వైఖరితో ఉందన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, వామపక్ష పార్టీలు, తెలంగాణ జన సమితి, న్యూడెమోక్రసీ, పీఆర్టియు, ఎస్టియు టిఎస్, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాల మద్దతుతో బరిలో నిల్చిన తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షుడు కుక్కల నాగరాజు, మధు, కోటి, అశోక్, శ్రావణ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్ని ప్రతిష్ట



నవతెలంగాణ-మంగపేట

మండలంలోని శ్రీ మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం అగ్ని ప్రతిష్ట కార్యక్రమాన్ని అమరవాది కృష్ణమాచార్యుల పురోహిత బృందం వైభవంగా నిర్వహించింది. అగ్ని ప్రతిష్టలో భాగంగా ఉత్సవమూర్తులను చింతామణి జలాలతో అభిషేకించారు అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ తంతు నిర్వహించి గరుడ పూజ చేశారు. అనంతరం పంచముఖ ఆంజనేయ స్వామికి అభిషేకం చేసి సుదర్శన హోమం నిర్వహించారు. పది రోజులపాటు వైభవంగా జరగనున్న ఈ కార్యక్రమాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుండి సందర్శకులు వేలాదిగా తరలివస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వాహణాధికారి శనిగల మహేష్, అర్చకులు రాజశేఖరశర్మ, రాఘవాచార్యులు, ఈశ్వర్ చంద్ శర్మ, పవన్ కుమారాచార్యులు, ఆలయ సిబ్బంది శేషు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లూరు జాతరలో వైద్య శిబిరం

నవతెలంగాణ-మంగపేట



మల్లూరు హేమాచల జాతరకు వచ్చిన సందర్శకులకు వైద్య సేవలు అందించడానికి మండలంలోని చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు జాతరలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అస్వస్థతకు గురైన ప్రజలకు వైద్య సేవ లను అందిస్తున్నట్లు చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు యమున తెలిపారు. కాగా మంగళవారం ఈ వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ క్రాంతికుమార్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జాతరకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. డాక్టర్ వేణు, ఫార్మసిస్ట్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించాలి'


నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

బీఆర్ఎస్ బలపర్చిన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపుకోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్న తారుమారు మల్లన్న అని, తప్పుడు ఆరోపణలతో క్యూ న్యూస్ ద్వారా కేసీఆర్‌పై, బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ తెలంగాణ యువతను ఉద్యోగస్తులను మాయ మాటలతో తప్పుదారి పట్టించి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమనికి కారణమయ్యాడన్నారు. రేవంత్ రెడ్డికి, చింతపండు నవీన్ తోడైతే దోపిడీకీ అంతే ఉండదని అన్నారు. విజ్ఞానులైన పట్టభద్రులు ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మండల కమిటీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, నాయకులు ఖాజాపాషా, వావిలాల రాంబాబు, కుమ్మరి చంద్రబాబు, ధన్నపునేని కిరణ్, కోట నర్సింహులు, ఇట్టెం నాగరాజు, బోడ శంకర్, మాదరి రాంబాబు, పాలకుర్తి దేవేందర్, మహేశ్వర్, చిన్ని, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భూసారం పెంచడంలో పచ్చి రొట్ట దిట్ట

- మండల వ్యవయాధికారి అత్తె సుధాకర్

నవతెలంగాణ-మల్హర్‌రావు



భూసారం పెంచడంలో పచ్చిరొట్ట దిట్టని మండల వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోవు వానాకాలం-2024 సీజన్‌కు గాను రాయితీ పై జీలుగ విత్తనాలు 90 క్వింటాల్లు మండల కేంద్రమైన తాడిచెర్లలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కొయ్యూర్ అగ్రోస్ రైతు సేవ కేంద్రంలో పంపిణీకి సిద్దంగా ఉన్నాయన్నారు. కిలోకు మొత్తం ధర రూ.93, ప్రభుత్వ రాయితీ రూ.55.80, రైతు వాటా రూ.37.20 ఉంటుందన్నారు. ఎకరానికి 12 కిలోల చొప్పున రెండున్నర ఎకరాలకు సరిపోతుందని,. వరి, మిరప పంట వేసే రైతులు తప్పని సరిగా పచ్చి రోట్ట విత్తనాలు చల్లుకోవాలన్నారు. భూ సార వంతంతోపాటు పంట దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. ఒక బస్తా(30కిలోల) జీలుగ విత్తనాలు రూ. 1116 ఉంటుందన్నారు. కావాల్సిన రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ ప్రతితో మండల వ్యవసాయధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- ఎమ్మెల్సీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సత్యాపాల్ రెడ్డి

నవతెలంగాణ - ములుగు

ఈ నెల 27వ తేదీన జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్సీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డిఓ సత్యాపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డిఓ సత్యాపాల్ రెడ్డి వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై పీఓలు, ఏపీఓలకు, ఓపిఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలు పివోలు, ఏపీవోలు, ఓపిఓల పాత్ర కీలకంగా ఉంటుందని అన్నారు. ఎన్నికల సంఘం విధివిధానాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఓటర్లు బ్యాలెట్ బాక్స్‌లలో బ్యాలెట్ పేపర్‌తో ఓటు వేస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్నికల నియమనిబంధనలను పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, తహసీల్దార్ విజయభాస్కర్, సూపరింటెండెంట్ శివకుమార్, ఎలక్షన్ డీటీలు విజయ్, అనిస్ ఫాతిమా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- సీఐ రంజిత్‌కుమార్, ఏడీఏ శ్రీపాల్



నవతెలంగాణ - ములుగు

నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ములుగు సీఐ మేకల రంజిత్ కుమార్, ఏడిఏ శ్రీపాల్ విత్తన దుకాణ యజమానులను హెచ్చరించారు.ములుగు మండలంలోని విత్తన దుకాణాలలో వ్యవసాయ, పోలీసు శాఖలు సంయుక్తంగా మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు దుకాణ యజమానులకు పలు సూచనలు చేశారు. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, రైతు అడిగిన వితనలనే ఇవ్వాలని, బలవంతంగా ఎస్టంలేని విత్తనాలు ఇవ్వరాదన్నారు. రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలనీ,నకిలీ విత్తనాలు అమితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి ఎం సంతోష్, ఎస్సై లక్ష్మారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించాలి

- తహసీల్ధార్ వీరస్వామి



నవతెలంగాణ-మంగపేట

మల్లూరు జాతరకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన వసతులు కల్పించాలని తహసీల్దార్ వీరస్వామి మల్లూరు హేమాచల ఆలయ ఇన్‌చార్జి ఈవో శనిగరపు మహేష్‌కు సూచించారు. మంగళవారం మల్లూరు ఆలయాన్ని సందర్శించిన తహసిల్దార్ వీరస్వామి జాతరలో ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండవ యాదగిరిగుట్టగా ప్రసిద్ధి పొందిన హేమాచల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ నుంచి కూడా వేలాదిగా ప్రజలు తరలి వస్తారని అన్నారు. ఈ నేపథ్యంలో జాతరలో సానిటైజేషన్, స్నానపు గదుల ఏర్పాటు, చలువ పందిళ్ల తాగునీటి సౌకర్యం వంటి వసతుల ఏర్పాట్లను పరిశీలించి కార్య నిర్వాహణాధికారి మహేష్‌కు తగిన సూచనలు చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి తులా రవి, ఎంపీడీఓ కృష్ణ ప్రసాద్, ఎంపీఓ మమత, ఎంఆర్ఐ శ్రీనివాసు పాల్గొన్నారు.

'ఆదివాసీ గిరిజనులు ఉపయోగించుకోవాలి'

నవతెలంగాణ-మహదేవపూర్

బెస్ట్ అవైలబుల్ స్కీం 2024-25కింద 3వ, 5వ, 8వ తరగతిలో ప్రవేశాల కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఆదివాసీ గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కుమార్ మంగళవారం ప్రకటనలో కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1,50,000, అర్బన్ అయితే రూ.2లక్షల లోపు ఉండాలని, ఐటీడీఏ ఏటూరునాగారం పీఓ కార్యాలయంలో అడ్మిషన్లు డ్రా పద్ధతిన తీస్తారని ఆన్నారు. జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం లో ఈ నెల 21 నుంచి జూన్ 6 సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొత్తం సీట్లు 18 ఉన్నాయని, వివిధ గిరిజన జనాభాకు అనుగుణంగా సీట్లు కేటాయిస్తారన్నారు. ఒక కుటుంబం నుండి ఒకరు మాత్రమే ఈ స్కీం కింద అర్హులు అన్నారు. దత్తత తీసుకున్న పిల్లలకు ఈ స్కీం వర్తించదని అన్నారు.

గిరిజనుల సంపదను దోచుకుంటున్న పెట్టుబడిదారులు

ప్రజా సంఘాల నాయకులు

నవతెలంగాణ-మహదేవపూర్/పలిమెల

దళిత ఆదివాసీ, గిరిజన ప్రజల సంపదను ఇసుక క్వారీల పేరిట పెట్టుబడిదారులు దోచుకుపోతున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల మండలంలో పర్యటించిన ప్రజా సంఘాల నాయకులు మండలంలోని పంకెన, పెద్దంపేట గ్రామాలలోని గోదావరి ప్రాంతంలో ఉన్న ఇసుక క్వారీలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల రవీందర్ మాట్లాడారు. పలిమెల మండలంలో పంకెన పెద్దంపేట ఇసుక క్వారీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న ఇసుకను ఇక్కడ ఉపయోగించుకుండా పట్టణ ప్రాంతాలకు తరలించి ఈ ప్రాంతంలో ఉన్న భూగర్భ జలాలను అడుగంటి పోయేలా చేస్తున్నారని వాపోయారు. ఈ ప్రాంతంలోని ప్రజలకు ఉపయోగపడే విధంగా క్వారీలు మంజూరు అయితే పెట్టుబడి దారులు వారి స్వలాభం కోసం సంబంధిత శాఖల అధికారులను మచ్చిక చేసుకుని ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా భారీ యంత్రాలతో గోదారి ప్రాంతంలో ఉన్న ఇసుకను ఒడ్డున డంపింగ్ చేస్తున్నట్టు ఆరోపించారు. ప్రజలను మభ్యపెడుతూ ప్రజల వైపు మాట్లాడే నాయకులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఇసుక కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పంకెన, పెద్దంపేట గ్రామాల భారీగా ఇసుక డంపులు నిలువ ఉన్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఇక్కడున్న ఇసుక క్వారీలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలను పట్టించుకోలేని కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదివాసీలను నక్సలైట్ల పేరుతో ఎన్కౌంటర్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆపరేషన్ కంగారును తక్షణమే ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఇసుక క్వారీలను రద్దు చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అక్కల బాపు యాదవ్ పీక కిరణ్ దయ్యం పోచయ్య స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



టీఎస్ స్థానంలో 'టీజీ' తక్షణమే అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ - ములుగు



టిఎస్ స్థానంలో టీజీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీ చేసినందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తక్షణమే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆదేశించారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర అబ్రియేషన్స్ సూచించే 'టీఎస్' స్థానంలో టీజీని వినియోగించేందుకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిన దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయని అన్నారు. జిల్లాలో ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫార మ్‌లు ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్‌ను టీఎస్ బదులుగా టీజీని వాడాలని కలెక్టర్ కోరారు.

ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి

నవతెలంగాణ - ములుగు

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలికి మే 27 న జరుగనున్న ఉప ఎన్నికలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ములుగు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారిని, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ప్రకటన లో తెలిపారు. ఈ నెల 24 తేదీ వరకు ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించే ఈ ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

విద్యుత్ సిబ్బంది సేవలు అభినందనీయం

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ మండలంలోని విద్యుత్ ప్రయివేట్ సిబ్బంది సేవలు అభినందనీయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. రాత్రిపగలు, ఎండావాననక ఎక్కడ వైర్లు తెగినా... ఎక్కడ గాలి దుమారాలకు చెట్టు విరిగిపడి వైర్లు కింద పడినా ఆయా గ్రామస్తులు వెంటనే కరెంటు పోయిందని ఫోన్ చేయగానే వెంటనే వచ్చి మరమ్మతులు చేసి వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేయడంలో వారి సేవలు ఎంతో అభినం దనీయమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత వర్షాకాలం భారీ వర్షానికి పెద్దంపేట వద్ద బ్రిడ్జి తెగిపోవడంతో పాటు పలిమెల మండలానికి పూర్తిగా కరెంటు లేకపోవడంతో జిల్లా స్థాయి అధికారి నుండి విద్యుత్ హెల్పర్ వరకు రాత్రి పగలు తేడా లేకుండా రెండు రోజుల పాటు మరమ్మతులు చేసి పలిమెల మండలానికి విద్యుత్ అంతరాయం లేకుండా పనిచేశారని గుర్తు చేశారు. అదేవిధంగా సూరారం బెగ్లూరు మధ్య సబ్ స్టేషన్ నుండి బెగుళూరు వరకు పూర్తిగా చెరువు నుండి స్తంభాలు ఉన్నాయని, చెరువు పూర్తిగా నిండిపోయినపుడు కూడా మరమ్మతులు చేసినట్టు చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వారి సేవలను గుర్తించి పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భూమికి

హద్దులు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-మహదేవపూర్

స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని కాటారం మండల ప్రచార కమిటీ కో కన్వీనర్ మొగిలి రాజ్ కుమార్ యాదవ్ కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి ఆయన మాట్లాడారు. కాటారం మండలం రేగుల గూడెం శివారులోని సర్వే నెంబర్ 201లో 0-18 గుంటల ప్రభుత్వ భూమి బూడిదపల్లి ప్రాథమిక పాఠశాలకు కేటాయించినట్టు చెప్పారు. ఆ భూమి అన్యాక్రాంతం కాకుండా మండల రెవెన్యూ సర్వేయర్ అధికారితో హద్దులు ఏర్పాటు చేయించాలని విన్నవించారు. ఆయనవెంట స్థానికులు, పలువురు ఉన్నారు.



ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను ఆదరించాలి

యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు

పోషాల మహేష్‌గౌడ్

నవతెలంగాణ-గణపురం

ఉమ్మడి నల్గొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల పట్ట భద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని భూపాలపల్లి యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు పోశాల మహేష్ గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. తీన్మార్ మల్లన్న అంటేనే పేదవాడు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరంతరం పేద ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని అన్నారు. ఎన్నో అవంతరాలు అడ్డంకులు ఎదురైన ప్రజల పక్షాన నిలబడి పోరాడగల నాయకుడు అన్నారు. తీన్మార్ మల్లన్నకు చట్టసభల్లో అవకాశం ఇస్తే రాబోయే రోజుల్లో పట్ట భద్రులకు అన్ని విధాలుగా అవకాశాలు కల్పిస్తాడని అన్నారు. జరగబోయే ఉప ఎన్నికల్లో మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
బుధవారం | మే 22, 2024 | www.navatelangana.com

ప్రొఫెసర్ సారంగపాణి దంపతులకు సన్మానం



నవతెలంగాణ-హసన్‌పర్తి

గ్రేటర్ 65వ డివిజన్ ఎల్లాపూర్‌లో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సారంగపాణి దంపతులకు సన్మానం జరిగింది. 1984లోనే కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సారంగపాణి ఆదర్శ వివాహం చేసుకొని నేటికి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దంపతులిద్దరిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సారంగపాణి మాట్లాడుతూ నాడు గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన చైతన్యమే నన్ను ఒక యూనివర్సిటీలో ప్రొఫెసర్ స్థాయికి చేర్చిందన్నారు. బౌద్ధాన్ని ప్రజల మధ్యలో తీసుకెళ్లాలని బౌద్ధమే భారతదేశానికి దిక్సూచి అని చెప్పారు. ప్రపంచానికి మార్క్స్ సిద్ధాంతం చాలా గొప్పదన్నారు. భారతదేశానికి అంబేద్కరిజం గొప్పదని తెలిపారు. ఈ రెండు లాల్ నీల్ సిద్ధాంతాలు అణచివేయబడుతున్న పేద బడుగు బలహీన వర్గాల సిద్ధాంతమే అంటూ మార్క్సిజం, అంబేద్కరిజం యొక్క గొప్పతనాన్ని వివరించారు. లాల్ నీల్ ఐక్యత వర్ధిల్లాలని కొనియాడారు. గ్రామంలో సామాజిక కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్న తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ కమిటీ ఎల్లాపూర్‌ను ప్రొఫెసర్ సారంగపాణి దంపతులు అభినందించారు. గ్రామంలో కమిటీ చేస్తున్న సామాజిక కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ కమిటీ ఎల్లాపూర్ సభ్యులు, గ్రామ పెద్దలు, కమ్యూనిస్టు పార్టీ ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

దళితుడిపై అగ్రవర్ణాల దాడి ఖండించాలి

నవతెలంగాణ-చెన్నారావుపేట

లంబాడ దళితుడి పై కులం పేరుతో దూషించిన బీసి ముదిరాజ్ కులానికి చెందిన నాయకులకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, హత్య ప్రయత్నం కేసును పెట్టి కఠినంగా శిక్షించాలని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు కన్నం మదర్ డిమాండ్ చేశారు. మంగళ వారం మండల పరిధిలోని పాపయ్యపేట లో ఎమ్మార్పీఎస్ మండల ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మదర్ మాట్లాడుతూ, పాపయపేట గ్రామానికి చెందిన దళితుడైన జాటోత్ యాకూబ్ పై అగ్రవర్ణాల చెందిన చెన్నూరు రవి, చెన్నూరు సాంబయ్య, చెన్నూరు రంజిత్ లు సోమవారం వ్యవసాయ భూవివాదంలో జరిగిన ఘర్షణలో కులం పేరుతో దూషిస్తూ అసభ్యకర పదజాలంతో భయభ్రాంతులకు గురి చేసిన వారిపై పోలీసులు చట్టరీత్య చర్యలు తీసుకొని తక్షణమే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, హత్య ప్రయత్నం కేసు పెట్టి దళితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అబ్బదాసి దిలీప్, తిక్క ప్రకాష్, జన్ను శ్రీకాంత్, కన్నం సూరయ్య, కన్నం వెంకన్న, చంటి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ వీసీకి అభినందనలు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కాకతీయ యూనివర్సిటీ చరిత్రలో గత మూడు సంవత్సరాలుగా వైస్ ఛాన్సలర్ గా ప్రొఫెసర్ తాటికొండ రమేష్ పాలన అద్భుతమని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్ అన్నారు. మంగళవారం ఫార్మసి డిపార్ట్మెంట్లో జరిగిన కాంట్రాక్ట్ అధ్యాపకుల సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ మాట్లాడుతూ, కాకతీయ యూనివర్సిటీ కి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ తీసుకురావడంలో వీసీ ఎంతో కృషి చేశారని, తద్వారా జాతీయ స్థాయిలో యూనివర్సిటీ పేరు ప్రతిష్ఠలు మరింతగా పెంచారు అన్నారు. అదేవిధంగా ప్రతిష్టాత్మకమైన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించడం భారతదేశంలోని యూనివర్సిటీలలో కాకతీయ యూనివర్సిటీ స్థానాన్ని మరింతగా పెంచింది అన్నారు. అంతర్జాతీయ సదస్సులు నిర్వహించారని అన్నారు. తెలంగాణా రాష్ట్రంలోనే తొలిసారిగా కాంట్రాక్ట్ అధ్యాపకులను గుర్తించి పాలనా పదవులు కేటాయించారని, ఆ తర్వాతే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు కాంట్రాక్ట్ అధ్యాపకులను పాలనా పదవుల్లో భాగస్వాములు చేశారని ఇది చారిత్రాత్మక నిర్ణయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ డి ప్రసాద్, డాక్టర్ మధుకర్ రావు, డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ దామెర బిక్షపతి, డాక్టర్ జెత్య, శశిధర్ , దయాకర్ స్వప్న, లక్ష్మి, సంగీత్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ పునరుద్ధరణ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నడికూడ

మండలంలోని చౌటుపర్తి గ్రామంలో కొలువై ఉన్న 62 అడుగుల అభయ వీరాంజనేయ స్వామి విగ్రహ పునరుద్ధరణ కోసం మంగళవారం ఆంజనేయ స్వామి భక్తబందం ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించిన అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ 2013 జూన్ 23వ తేదీన ఎంతో మంది దాతల సహాయ సహకారాలతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన స్వామివారి విగ్రహానికి రంగులు వేయటంతో పాటు, పెద్దఎత్తున హోమం నిర్వహించి, భక్తుల సౌకర్యార్థం వసతులు కల్పించాలని ఆంజనేయ స్వామి భక్త బృందం తీర్మానం చేశారు.రాబోయే హనుమాన్ జయంతి వరకు పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని నిర్ణయించారు. గ్రామ మరియు పరిసర ప్రాంత ప్రజలు, భక్తులు, దాతలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలగంటి సమ్మిరెడ్డి, మాజీ సర్పంచ్ గూడెం కృష్ణమూర్తి, రాయిడి సతీష్ చారి, బొక్క బిక్షపతి, డాక్టర్ మురళీధర్ రెడ్డి, పురెళ్ళ రంజిత్, తోట సదయ్య శ్రీను, కె.వినయ్ కుమార్, రమణా రెడ్డి పాల్గొన్నారు.

పరోపకారం చేయడం ప్రథమ కర్తవ్యం



నవతెలంగాణ-వరంగల్

పరోపకారం చేయడం తన ప్రథమ కర్తవ్యం అని సామాజిక కార్యకర్త గుజ్జారీ మహేష్ అన్నారు. మంగళవారం రాజీవ్ గాంధీ వర్ధంతి ని పురస్కరించుకొని పేదలకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మందికి డబ్బు ఆస్తులు అంతస్తులు ఉన్నప్పటికీ ప్రజలకు దానం చేయడంలో కొంతమంది వెనకడుగు వేసే వారు ఉంటారని అన్నారు. బల్దియా కార్యాలయంలోని మలేరియా విభాగంలో పనిచేస్తు నిరుపేదలకు తమ వంతు సాయం చేస్తూన్నాని అన్నారు. నిరూ పేద కుటుంబంలో పుట్టిన వ్యక్తినీ కాబట్టే పేదరికం వల్ల నిరుపేదలు ఎంత బాధపడుతారో అనే విషయం తెలిసిందన్నారు. గత ఆరు ఏండ్ల నుండి నిరు పేదలకు ఉచితంగా అన్నదానం, చెద్దర్లు, బట్టలు పంపిణీ, ప్రతి ఏడాది రెండు సార్లు రక్తదానం చేయడం తో పాటు కరోనా సమయం లో కూరగాయలు, నిత్యవసర వస్తువుల పంపిణీ, ఆలు బిర్యానీ పాకెట్లకు పంపిణీ చేయడం వల్ల అనేక ప్రశంస పత్రాలు వచ్చాయని అన్నారు. ప్రతి ఒక్కరు నిరుపేదలకు ఆకలిని తీర్చే వారుగా ఉండాలని అన్నారు. మధర్ థెరిస్సా ను ఆదర్శంగా తీసుకుని నిరుపేదలకు మరింత సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

మురళీ కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త జంపాల మురళి ఇటీవల గుండెపోటుతో మరణించారు. వారి కుటుంబానికి సీతంపేట మాజీ ఎంపీటీసీ గిన్నారపు సుగుణసదానందం మంగళవారం రూ.5 వేల తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే కీలకమని వారి సంక్షేమమే నాయకుల లక్ష్యమన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఎవరికి ఆపద వచ్చినా వారి కుటుంబ సభ్యురాలిగా అందుబాటులో ఉండి ఆర్థిక చేయూతనందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తోకల కిషన్ రెడ్డి, మాజీ సర్పంచ్ చేరాలు, చిన్న బాబు, గిన్నారపు రాజు, గిన్నారపు రోహిత్, బాషబోయిన రాజయ్య జంపాల శ్రీను, జంపాల యుగేందర్, జంపాల చంటి, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి వీసీపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయంలో అవినీతి అక్రమాలకు పాల్పడిన వీసీ తాటికొండ రమేష్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాల విద్యార్థుల సొమ్మును దుర్వినియోగం చేసిన వీసీ ఈ తాటికొండ రమేష్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. యూనవర్శిటీలో వీసీ శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేస్తూ విశ్వవిద్యాలయంలో టాపాకాయలు పేలుస్తూ విద్యార్థులు ఉద్యోగస్తులు సంతోషాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహమ్మద్ పాషా మాచర్ల రాంబాబు అంకిల శంకర్ నిమ్మల రాజేష్ మధు ప్రశాంత్ నిఖిల్ ఉదయ్ కిరణ్ అభి విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం







నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాన్ని అభివద్ధి చేశారు హనంకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు జిల్లా అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ కలిసి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకష్ణ దివంగత మాజీ స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ చూపిన బాటలో మనం నడవాలని అతిచిన్న వయసులో ప్రధానిగా బాధ్యతలు చేపట్టి సైన్స్‌ను అభివృద్ధి చేయడం కంప్యూటర్ రంగాన్ని టెలిఫోన్ రంగాన్ని టెక్నాలజీని భారతదేశానికి పరిచయం చేయడం , రాజీవ్ గాంధీ సేవలు గుర్తుచేస్తూ ఆ మహనీయుడు ప్రజాదరణ పొందిన ప్రజా నేత అన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఆధ్వర్యంలో శాసనసభ్యుల సలహాలతో కాంగ్రెస్ కార్యకర్తలు అందరం నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యలు తీర్చాలన్నారు. ఈ కార్యక్రమం లో అనుబంధ సంఘాల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : దేశ సౌభ్రాతత్వాన్ని కాపాడుడం కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయుడు స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 31 వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, కాంగ్రెస్ జిల్లా కిషన్ సెల్ ఉపాధ్యక్షుడు సాదు మధుసూదన్ రెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మండల ఉపాధ్యక్షుడు నన్నే బోయిన రమేష్, కార్యదర్శి మంచాల సదయ్య, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధన రమేష్, మండలం మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, యూత్ అధ్యక్షుడు బండి హరీష్, మాజీ ఎంపీటీసీ ఈర్యనాయక్, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు రూపక శ్రావణ్, జోరు వీరయ్య, బొంత శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ ననుమాస కరుణాకర్, పోలపల్లి బిక్షపతి, చెవ్వ వెంకటేశ్వర్లు, ననుమాస వీరస్వామి, కుమారస్వామి, కేతిడి జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : దివంగత నేత భారత దేశ మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వర్ధన్నపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ అన్నారు.వర్ధన్నపేట నియోజక వర్గం లోని ఇల్లందలో మంగళవారం రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్, మండల ఎస్సీ సెల్ నాయకులు మల్లెపాక సమ్మయ్య, ఇల్లంద గ్రామ పార్టీ అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు గుంటి కుమారస్వామి, గడ్డం సమ్మయ్య, నిమ్మనబోయిన పైడి, మల్లెపాక సాయిలు, సమ్మెట రాజు, రంగు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక భారత దేశ సృష్టికర్త, భారత రత్న, ఐటి రంగాన్ని ముందుకు తీసుకెళ్లిన పితామహుడు భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా పర్వతగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కందికట్ల అనిల్, బుద్ధి కుమారస్వామి,బొట్ల కనకరాజు, జిల్లా కనకయ్య, బొట్ల వెంకన్న, వంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణల సృష్టికర్త రాజీవ్ గాంధీ

రాయపర్తి : టెలీకమ్యూనికేషన్స్ విప్లవంతో దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడు.. ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి, ఆ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనుడు.. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని మంగళవారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐటీ రంగంలో ఈనాడు దేశం అగ్రగామిగా ఉందంటే అది రాజీవ్ సంకల్ప ఫలితమే అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఆలయ చైర్మన్ రామకష్ణ చార్యులు, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, సుదర్శన్ రెడ్డి, నర్సయ్య, యాకుబ్, కుమారస్వామి, ఆఫ్రోస్, శ్రీనివాస్, వెంకట్, రవి తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : భారతదేశంలో సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన మహనీయుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రధానిగా దేశాన్ని ఆర్థిక పథంలో నడిపారని, సరికొత్త సంస్కరణలతో అభివద్ధిలో వేగం పెంచారని కొనియాడారు. అతి చిన్న వయసులోనే ప్రధాని పీఠాన్ని అధిరోహించి, త్యాగానికి ప్రతీకగా చరిత్రలో నిలిచిపోయారని గుర్తు చేశారు. ఆయన చేపట్టిన కార్యచరణలో భాగంగా దేశంలో సాంకేతిక రంగంలో ఎంతో పురోగతి సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు చిందం రవి, దుబాసి కృష్ణమూర్తి, ఎండి రఫీ, చింతల రవిపాల్, ప్రపంచ రెడ్డి, ప్రేమ్ సాగర్, రాజేందర్, రాజు, శీను, రాము పాల్గొన్నారు.

హసన్‌పర్తి : మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జీవితం యువతకు ఆదర్శమని మాజీ ఎంపీటీసీ గిన్నారపు సుగుణసదానందం అన్నారు. మండలంలోని సీతంపేటలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ప్రధానిగా దేశానికి, యువతకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నద్దునూరి చేరాలు, తోకల కిషన్‌రెడ్డి, జంపాల యుగందర్, శ్రీనివాస్, చంటి, జంగ రమేష్, చిన్నబాబు, భాషబోయిన రాజయ్య, గిన్నారపు రవి, గిన్నారపు రోహిత్, పాల రవి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.







మొదటి ప్రాధన్యత ఓటువేసి రాకేష్‌రెడ్డిని గెలిపించండి : పెద్ది



నవతెలంగాణ-నర్సంపేట

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి ఓటేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో పలు వార్డులో పట్టభద్రులను కలుసుకొని ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి రాకేష్‌రెడ్డికి ఓటేయాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం పట్టణంలోని పద్మశాలి గార్డెన్స్‌లో నిర్వహించనున్న పట్టభద్రుల సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నారని పట్టభద్రులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, గుంటి కిషన్, నాగిశెట్టి ప్రసాద్, మండల శ్రీనివాస్, రాయిడి దుశ్యంత్ రెడ్డి, బండి రమేష్, వేణుముద్దల శ్రీధర్ రెడ్డి, శేర్ల శ్రీనివాస్, బీరం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ : టిఆర్ఎస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు తథ్యమని పరకాల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ కత్తెరపల్లి దామోదర్ అన్నారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు రాకేష్ రెడ్డి గెలుపు కోరుతూ మంగళవారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో బిఆర్ఎస్ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల ఇంచార్జ్ కత్తెరపల్లి దామోదర్ మాట్లాడుతూ వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టాభద్రుల ఎన్నికలలో ఉన్నత విద్యావంతుడు, ప్రశ్నించే గొంతుక రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకులపల్లి మనోహర్, మాజీ కార్పొరేటర్ ల్యాదల బాలు, క్లస్టర్ ఇంచార్జి బొమ్మ ఉజ్వల్ కుమార్, ల్యాదల రాజు, నాయకులు మిద్దెపాక విజయ్, చింతం రవికుమార్, కళాధర్, గణేష్, కొమ్మాలు, దయాకర్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ చౌరస్తా : వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల

నేటి పట్టభద్రుల సమావేశానికి కేటీఆర్ హాజరు

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బి.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి మద్దతుగా కెయు బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పాలమకుల కొమురయ్య దామోదర్, జెట్టి రాజేందర్ మాట్లాడుతూ ములుగు రోడ్డులోని ఎల్ఐసి కేంద్ర కార్యాలయం, బీఎస్ఎన్ఎల్, ఎల్బి కళాశాల, కాళోజీ హెల్త్ యూనివర్సిటిలోని పట్టభద్రులను కలిసి ఏనుగుల రాకేష్ రెడ్డి సీరియల్ నెంబర్ 03 లో మొదటి ప్రాధాన్యత ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రత్యేకమైన పట్టభద్రుల ఎన్నికల్లో మేధావులు విజ్ఞతతో పెద్దల సభకు పెంచే దిశగా ఏనుగుల రాకేష్ లాంటి ఒక విద్యావేత్తను శాసన మండలికి ఒక పోరాట గొంతుకగా పంపాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి రాజేష్ నాయక్, కె.యు నాయకులు పిన్నింటి విజయ్ కుమార్, కొమురం సిద్దు, రాజశేఖర్,అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంను మండల ఇన్చార్జి గుజ్జ గోపాల్ రావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ గురువారం రోజున నిర్వహించే వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి మండలం నుండి 300 మంది పట్టభద్రులను తీసుకొని వెళ్లాలని ఆయన సూచించారు. 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ కు ఆప్షన్ ఉస్మాన్ అలీ, నందనం సొసైటీ వైస్ చైర్మన్ చంద్రరావు, వైస్ఎంపీపీ తంపుల మోహన్, ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు సోమేశ్వరరావు , రైతు అధ్యక్షులు రాఘవులు, గ్రామాల అధ్యక్షులు తాటికాయల కుమార్, కంజర్ల సంపత్ రావు, జక్కుల రాజు, సింగారపు చందర్, జన్ను రాజు, ఎస్కే జిందా, సుదర్శన్, సాగర్, కొల సంపత్, మామిండ్ల సంపత్, గద్దల ప్రభాకర్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గీసుగొండ : విద్యావంతుడు ప్రజలకు సేవ చేయాలని ధృడనిశ్చయంతో ఖమ్మం-వరంగల్ -నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరిలో ఉన్న బిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని అధిక మెజార్టీ తో గెలిపించుకోవాలని మండల యూత్ అధ్యక్షుడు సిరిసే శ్రీకాంత్ విద్యావంతులను కోరారు. మండలంలోని మచ్చాపురం, చంద్రయ్యపల్లి, బొడ్డు చింతలపల్లి, కొమ్మాల గ్రామాలలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సిరిసే శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ క్లస్టర్ ఇంచార్జీలు కోట ప్రమోద్, రాజేందర్, ఎంపీటీసీ కంబాల రజిత కోటి,యువత అధ్యక్షులు రాకేష్, యుగేందర్, బండి రాజు, ప్రవీణ్, సురేష్, ప్రసాద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి

వర్ధన్నపేట సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహస్వామి



నవతెలంగాణ-పర్వతగిరి

సామాజిక మాధ్యమాల్లో బాధ్యతాయుతమైన పోస్టులను మాత్రమే పెడుతూ బాధ్యతాయుతంగా మెలగాలని వర్ధన్నపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 19న జరిగిన ఘటనపై మాట్లాడుతూ ఫోన్‌లో మాట్లాడుతూ ఆపరేషన్ చేశారన్న విషయం పూర్తిగా ఆవాస్తవమన్నారు. బాధితురాలు ప్రభుత్వ ఆసుపత్రిలో మొదటి కాన్పు సుఖ ప్రసవం కాగా రెండవ కాన్పు నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించగా నార్మల్ డెలివరీ చేశామని, డెలివరీ అయిన బేబీకి ఆక్సిజన్ లెవెల్ తక్కువగా ఉన్నందున మెరుగైన చికిత్స కోసం న్యూనటల్ అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించామన్నారు. ఎంజిఎం ఆసుపత్రిలో శిశువు ఒకరోజు చికిత్స పొందిన తదుపరి మరుసటి రోజున చికిత్స పొందుతూ శిశువు మతి చెందినట్లు బాధితురాల బంధువులు తెలిసినట్లు వివరించారు. ఈ విషయమై వైద్యశాఖ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించామన్నారు. కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియాని వేదికగా మార్చుకొని నిజా నిజాలు తెలియకుండా ఆసుపత్రి సిబ్బందిపై అసభ్యకరమైన పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి పోస్టు పెట్టడం భవ్యం కాదని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై నేడు అసిస్టెంట్ డీఎంహెచ్ వో గోపాలరావు ఆసుపత్రిని సందర్శించి మెరుగైన వైద్య కోసం డాక్టర్లు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు అయన తెలిపారు.

ధూప దీప నైవేద్య అర్చక సంఘం కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-హసన్‌పర్తి

గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం తెలంగాణ ధూప దీప నైవేద్య సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆదేశాలతో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దూపదీప నైవేద్య అర్చక సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా వేదాంతం సంపతాచార్యులు, ప్రధాన కార్యదర్శులు ఉప్పుల ప్రణీత్ శర్మలు ఎన్నికైనట్లు కమిటీ ప్రకటించింది. వీరి కాల పరిమితి రెండు సంవత్సరాలు ఉంటుందని వారు తెలిపారు. కమిటీ నియామకానికి సహకరించిన ధూప దీప నైవేద్య రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, మండల అర్చకులకు, నూతన కమిటీలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రి స్వామి, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల మధుకర్ శర్మ, జిల్లా అధ్యక్షుడు సిద్ధాంతి గణేష్ కుమార్, మండల అర్చకులు పాల్గొన్నారు.

